నేటి కందం- నేటికి అందం

తీరుగ ఆస్కారు పుర
స్కారమ్మును ఎలిజబెత్తు చలచిత్రముకై
గోరుచు-దర్శకుడైన-క
పూరి మహోన్నత పథమున ముందుకు నడచెన్ !!

(9-2-1999 శేఖర్ కపూర్ సినిమా ఎలిజబెత్ ఆస్కారు అవార్డుకు నామినేట్ అయిన రోజు)

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

చురక

అధికారం ఎవరిదైనా
అంతా రాజకీయమే
అవినీతి స్వార్థ ఖ్యాతి
అవి రగిలే గాయమే
నాయకులు పెరిగేందుకే
నిత్య కుల నినాదాలు
ఎదిగినంకా అభివృద్ధికి
ఏడ పోరు నాదాలు

-వేల్పుల నారాయణ
9440433475



website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 9-2-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :31 సంచిక:145 పేజీలు:6 వెల: రూ.1/-

## ముస్లింల ఖిల్లా ముస్తఫాబాద్‌లో చక్రం తిప్పిన బీజేపీ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ హవా కొనసాగిస్తోంది. మెజారిటీ మార్క్‌ను దాటి 46 సీట్లలో విజయానికి మార్గం సుగమం చేసుకుంది. ముస్లిం జనాభా అత్యధికంగా ఉన్న ముస్తఫాబాద్ లో బీజేపీ ఈసారి చక్రం తప్పింది. బీజేపీ సీనియర్ ఎమ్మెల్యే మోహన్ సింగ్ బిస్ట్ తన సమీప ప్రత్యర్థిపై 42,000కు పైగా ఓట్లకు పైగా ఆధిక్యంతో విజయాన్ని ఖరారు చేసుకున్నారు.

మోహన్ సింగ్ బిస్ట్ ప్రస్తుతం కర్వాల్ నగర్ నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఉన్నారు. అయితే కపిల్ మిశ్రాను ఈసారి కర్వాల్ నగర్ నియోజకవర్గం నుంచి పార్టీ అభ్యర్థిగా బీజేపీ నిలిపింది. దీంతో మోహన్ సింగ్ బిస్ట్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే వెంటనే బీజేపీ మరో జాబితా విడుదల చేస్తూ ముస్తఫాబాద్ సెగ్మెంట్ నుంచి ఆయనను తమ అభ్యర్థిగా ప్రకటించింది.

డీలిమిటేషన్ కమిషన్ సిఫారసులతో 2008లో ముస్తఫాబాద్ నియోజకవర్గం ఏర్పడింది. 2008, 2013లో కాంగ్రెస్ ఇక్కడ గెలిచింది. తొలి ఎన్నికలో బీజేపీ అభ్యర్థి హసన్ అహ్మద్‌పై కాంగ్రెస్ అభ్యర్థి హసన్ అహ్మద్ 978 ఓట్ల అధిక్యంతో గెలిచారు. 2013లో బీజేపీ అభ్యర్థి జగదీష్ ప్రధాన్‌పై 2,000 ఓట్ల ఆధిక్యంతో హసన్ గెలిచారు. 2019లో కాంగ్రెస్, బీజేపీ ఆధిపత్యానికి 'ఆప్' గండికొట్టింది. బీజేపీ అభ్యర్థి ప్రధాన్, హసన్ కుమారుడు అలి మెహన్దిని ఆప్ అభ్యర్థి చిత్తుచేశారు.

కాగా, 2025 అసెంబ్లీ ఎన్నికల్లో ముస్తఫాబాద్ నుంచి అరవింద్ కేజ్రీవాల్ సన్నిహితుడు అడిల్ అహ్మద్ ఖాన్ పోటీ చేయగా, కాంగ్రెస్ అభ్యర్థిగా అలి మేహంది, బీజేపీ నుంచి మోహన్ సింగ్ బిస్ట్ పోటీ చేశారు. ఎంఐఎం సైతం తమ అభ్యర్థిగా ఢిల్లీ అల్లర్ల నిందితుడు తాహిర్ హుస్సేన్‌ను బరిలోకి దింపింది.

## మహాకుంభమేళాకు ప్రత్యేక రైళ్లు.. నంద్యాల ఎంపీ శబరి

అమరావతి, ఫిబ్రవరి 8:మహా కుంభమేళాకు వెళ్ళే నంద్యాల జిల్లా భక్తులకు రైల్వే శాఖ శుభవార్త చెప్పిందని, జిల్లాలోని డోన్, కర్నూలు రైల్వే స్టేషన్ మీదుగా మహా కుంభమేళా కోసం వెళ్ళే భక్తులకు స్పెషల్ రైళ్ల సౌకర్యం దక్షిణ మధ్య రైల్వే కల్పించిందని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి తెలిపారు.

శనివారం ఎంపీ మాట్లాడుతూ.. ట్రెయిన్ నెంబర్ 07117/07118 తిరుపతి – దానపూర్ – తిరుపతి రైలు నంద్యాల జిల్లాలోని డోన్ జంక్షన్ రైల్వే స్టేషన్ నుండి ఈనెల 15వ తేది శనివారం 6:30 కు బయలుదేరి ఉత్తర ప్రదేశ్ లోని ప్రయాగరాజ్ కి 16వ తేది ఆదివారం రోజు సాయంత్రం 5:30 గంటలకు చేరుకుంటుందని, అనంతరం మళ్ళీ తిరుగు ప్రయాణంలో 17వ తేది సోమవారం రాత్రి 8:30 గంటలకు ప్రయాగరాజ్ లో బయల్దేరి డోన్ జంక్షన్ కి 19వ తేది బుధవారం ఉదయం 5:45 గంటలకు చేరుకుంటుందని, ఈ రైలు కర్నూలు, కాచిగూడ, నాగపూర్ మార్గంలో ప్రయాగరాజ్ కు వెళ్తుందని ఎంపీ వివరించారు. ఇదే రైలు కర్నూలు మీదుగా వెళుతుందని, కాబట్టి నంద్యాల వాసులు కర్నూలు నుంచి కూడా ప్రయాణం చెయ్యవచ్చునని ఆమె తెలిపారు. నంద్యాల జిల్లా నుంచి మహాకుంభమేళాకు వెళ్లే భక్తులు ఈ రైలును ఉపయోగించుకోవాలని ఎంపీ శబరి కోరారు.

## అభివృద్ధి, సుపరిపాలనే గెలిచింది.. ఢిల్లీ గెలుపుపై ప్రధాని మోదీ..

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:ఢిల్లీ ఎన్నికల ఫలితాల్లో 47 స్థానాల్లో స్పష్టమైన ఆధిక్యం కనబరిచి కమలం పార్టీ గెలుపు ఖాయం చేసుకుంది. దశాబ్దకాలం తర్వాత ఢిల్లీ పీఠం చేజార్చుకుంది ఆమ్ ఆద్మీ పార్టీ. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ అభివృద్ధి, సుపరిపాలనకే ఢిల్లీ ఓటర్లు పట్టం కట్టారని ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.

ఢిల్లీ ఎన్నికల ఫలితాల్లో ఆమ్ ఆద్మీ పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు భారతీయ జనతా పార్టీకే పట్టం కట్టారు. ఇప్పటికే మ్యాజిక్ ఫిగర్ దాటి స్పష్టమైన ఆధిక్యం కైవసం చేసుకుంది కమలం పార్టీ. ఆప్ పార్టీతో పాటు అధినేత కేజ్రీవాల్ విజయపరంపరకూ చెక్ పెట్టింది. చీపురు పార్టీ పదేళ్ల పాలనకు తెరదించి 27 సంవత్సరాల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత దేశరాజధాని గద్దెపై కూర్చోనుంది. ఢిల్లీ నియోజకవర్గంలో కేజ్రీవాల్‌ను ఓడించిన పర్వేశ్ వర్మనే బీజేపీ సీఎం అభ్యర్థిగా ఖరారు చేసినట్లు అనధికారిక సమాచారం. బీజేపీ భారీ విజయాన్ని పురస్కరించుకుని ప్రధాని మోదీతో పాటు అభివృద్ధి, సుపరిపాలనకే ఢిల్లీ ఓటర్లు పట్టం కట్టారని ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.

### అభివృద్ధి, సుపరిపాలన గెలిచాయి..ప్రధాని మోదీ..

ఢిల్లీలో బీజేపీ భారీ మెజార్టీతో గెలుపు ఖాయం చేసుకోవడాన్ని ఉద్దేశించి ప్రధాని మోదీ స్పందించారు. 'ప్రజల శక్తి అత్యున్నతమని ఆయన రాశారు! అభివృద్ధి గెలిచింది, సుపరిపాలన గెలిచింది. బిజెపికి చారిత్రాత్మక విజయాన్ని అందించినందుకు ఢిల్లీ లోని నా



సోదరసోదరీమణులందరికీ నా వందనం మరియు అభినందనలు! మీరు నాకు ఇచ్చిన అపారమైన ఆశీర్వాదాలు మరియు ప్రేమకు నేను మీ అందరికీ హృదయపూర్వకంగా కృతజ్ఞుడను. ఢిల్లీ అభివృద్ధిని, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచేందుకు ఉన్న ఏ అవకాశాన్ని వదలుకోం. ఇది మా హామీ. దీనితో పాటు అభివృద్ధి చెందిన భారతదేశాన్ని సృష్టించడంలో ఢిల్లీ ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని మేము భావిస్తున్నాం. ఈ తీర్పు కోసం పగలు రాత్రి పనిచేసిన నా బీజేపీ కార్యకర్తలందరినీ చూసి నేను చాలా గర్వపడుతున్నాను. ఇప్పుడు మేము మా ఢిల్లీ వాసులకు మరింత అంకితభావంతో సేవ చేసేందుకు సిద్ధంగా ఉంటాము.' అని ట్వీట్ చేశారు.

## సీఎం రేసులో పర్వేష్ వర్మ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:ఎగ్జిట్ పోల్స్ ఫలితాలను నిజం చేస్తూ ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ ఘన విజయం సాధించింది. ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఓడించడం ద్వారా లోక్‌సభ మాజీ సభ్యుడు., బీజేపీ అభ్యర్థి పర్వేష్ వర్మ (ఖజీతీలవబష్ట్ర ఎవతీఎజీ) 'జెయింట్ కిల్లర్'గా నిలిచారు. తద్వారా బీజేపీ ముఖ్యమంత్రి అభ్యర్థి రేసులో మొదటి స్థానంలో నిలిచారు. గెలుపుపై తిరుగులేని ధీమాతో ఉన్న అరవింద్ కేజ్రీవాల్‌ను 4,089 ఓట్ల తేడాతో వర్మ ఓడించారు. ఇదే స్థానంలో పోటీ



చేసిన మాజీ సీఎం షీలా దీక్షిత్ తనయుడు సందీప్ దీక్షిత్ కేవలం 4,568 ఓట్లకే పరిమితమయ్యారు. కేజ్రీవాల్‌ను ఓడించడం ద్వారా పర్వేష్ వర్మ సీఎం రేసులో మొదటి స్థానంలో నిలిచారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

ఎన్నికల వ్యూహంలో భాగంగా ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరనేది బీజేపీ ముందుగా ప్రకటించలేదు. బీజేపీకి సీఎం అభ్యర్థి లేడని, ఓటమిని ముందే అంగీకరించిందని 'ఆప్' విమర్శలు గుప్పించినా బీజేపీ తమ వ్యూహం ప్రకారమే ముందుకు వెళ్లింది. సీఎం అభ్యర్థిని ప్రకటించకుండా ఎన్నికలకు వెళ్లినప్పటికీ బీజేపీ ఘనవిజయం సాధించడంతో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ వ్యూహం ఫలించిందని స్పష్టమవుతోంది.

బీజేపీ కొత్త సీఎంగా పర్వేష్ వర్మకు బీజేపీ పగ్గాలు అప్పగించే విషయంపై బీజేపీ అధికారికంగా ప్రకటించనప్పటికీ ఆయనకు కలిసొచ్చే అంశాలు చాలానే ఉన్నాయి. బీజేపీకి అతిపెద్ద సవాలుగా ఉన్న కేజ్రీవాల్‌ను ఓడించడం ద్వారా పర్వేష్ వర్మ "జెయింట్ కిల్లర్"గా నిలిచారు. జాట్ ఫేక్టర్ కూడా ఆయనకు కలిసొచ్చే మరో అంశంగా చెప్పవచ్చు. న్యూఢిల్లీ నియోజవర్గం జాట్ ఆధిపత్యం ఉన్న సీటు కానప్పటికీ జాట్ వర్గాన్ని బీజేపీ నిర్లక్ష్యం చేస్తోందని తరచు ఆప్ విమర్శలు గుప్పిస్తూ వచ్చేది. ఇందుకు ప్రతిగా జాట్ నేత వర్మనే బీజేపీ ఇక్కడ నిలబెట్టింది. ఆప్‌కు ఓట్ బ్యాంక్‌గా ఉన్న జాట్లను ఆకర్షించడం, ఆప్ ఓట్ బ్యాంక్‌ను దెబ్బకొట్టడంలో బీజేపీ ఈసారి విజయం సాధించింది. కరడుగట్టిన హిందూవాదిగా వర్మకు పేరుంది. హిందుత్వకు సంబంధించిన అంశాలపై అనర్ఘళంగా మాట్లాడుతుంటారు. ముస్లింలను బుజ్జగించడం, ఢిల్లీలో అక్రమంగా ముస్లిం బంగ్లా దేశీయులు తిష్ట వేసిన అంశాలను ఎండగట్టడంలో ఆయన ముందున్నారు. పర్వేష్ వర్మకు 2025 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ టిక్కెట్ ఇవ్వలేదు. పార్టీ నిర్ణయాన్ని ఆయన శిరసావహించారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలపై ప్రధానంగా దృష్టి సారిస్తూ వచ్చారు. కేజ్రీవాల్ ప్రతిష్టకు గండికొట్టిన 'శీష్ మహల్' వివాదాన్ని ప్రజల ముందుకు తీసుకువెళ్లడంలో వర్మ సమర్థవంతగా వ్యవహరించారు. వీటికి తోడు.. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి సాహిబ్ సింగ్ వర్మ కుమారుడు కావడం పర్వేష్ వర్మకు కలిసొచ్చే మరో అంశం. పార్టీకి మొదట్నించి సాహిబ్ సింగ్ వర్మ పనిచేయడం, పార్టీ సీనియర్ నేతలందరితోనూ పర్వేష్ వర్మ సత్సంబంధాలు కలిగి ఉండటం విశేషం.

## మోడీ నాయకత్వంలో ఆదర్శవంతమైన రాజధానిగా ఢిల్లీ..

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై బీజేపీ సీనియర్ నేత, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పందించారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫాం 'ఛీ' (ట్విట్టర్) వేదికగా సంచలన ట్వీట్ చేశారు. 'పదే పదే తప్పుడు వాగ్దానాలతో ప్రజలను మభ్యపెట్టలేరని ఢిల్లీ ప్రజలు చెప్పారు.

వారి ఓట్లతో, ప్రజలు మురికి యమునా, మురికి తాగునీరు, విరిగిన రోడ్లు, పొంగిపొర్లుతున్న మురుగు కాలువలు, ప్రతి వీధిలో తెరిచిన మద్యం దుకాణాలపై స్పందించారు.

ఢిల్లీలో ఈ మహా విజయం కోసం అహోరాత్రులు శ్రమించిన వారు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, రాష్ట్ర అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ లకు నా హృదయపూర్వక అభినందనలు. 'మహిళల పట్ల గౌరవం, అనధికార కాలనీ నివాసితుల ఆత్మగౌరవం, స్వయం ఉపాధికి అపారమైన అవకాశాలు ఉన్న ఢిల్లీలో.. ఇక ప్రధాన నరేంద్ర మోడీ నాయకత్వంలో ఢిల్లీ ఆదర్శవంతమైన రాజధానిగా మారనుంది' అంటూ ట్వీట్ చేశారు.

## ఢిల్లీ సచివాలయానికి తాళం.. ఫైళ్లు, రికార్డులు భద్రపరచాలని ఆదేశం..

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:ఆప్ అధినేత అయిన అరవింద్ కేజ్రీవాల్ కూడా తన నిజయోజకవర్గంలో ఓటమి పాలయ్యారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ సచివాలయ ఉద్యోగులకు లెఫ్టినెంట్ గవర్నర్ నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చాయి. దీంతో ఢిల్లీ సెక్రటేరియట్‌ను సీజ్ చేశారు. సచివాలయం నుంచి ఏ ఒక్క ఫైల్, రికార్డు, హార్డ్ డ్రైవ్ బయటకు వెళ్లకూడదని లెఫ్టినెంట్ గవర్నర్ ఆదేశాలు జారీ చేశారు.

దాదాపు 26 ఏళ్ల తర్వాత ఢిల్లీ పీఠం కమల దళం చేతికి చిక్కింది. వరుసగా రెండు సార్లు అధికారం అనుభవించిన ఆమ్ ఆద్మీ పార్టీ పరాజయం దిశగా సాగుతోంది. ఆప్ అధినేత అయిన అరవింద్ కేజ్రీవాల్ కూడా తన నిజయోజకవర్గంలో ఓటమి పాలయ్యారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ సచివాలయ ఉద్యోగులకు లెఫ్టినెంట్ గవర్నర్ నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చాయి. దీంతో ఢిల్లీ సెక్రటేరియట్‌ను సీజ్ చేశారు. సచివాలయం నుంచి ఏ ఒక్క ఫైల్, రికార్డు, హార్డ్ డ్రైవ్ బయటకు వెళ్లకూడదని లెఫ్టినెంట్ గవర్నర్ ఆదేశాలు జారీ చేశారు.

పదేళ్లుగా ఢిల్లీలో అధికారం చెలాయించిన ఆప్‌పై బీజేపీ కొన్నేళ్లుగా అవినీతి ఆరోపణలు చేస్తూ వస్తోంది. ఢిల్లీలో బీజేపీ అధికారంలోకి వస్తే అసెంబ్లీలో కాగ్ నివేదికలు ప్రవేశపెడతామని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఆ మేరకు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ ఆదేశాలను జారీ చేశారు. గత ప్రభుత్వానికి సంబంధించి ఒక్క ఫైల్ కూడా బయటకు వెళ్లకూడదని పేర్కొన్నారు. గతంలో పలు రాష్ట్రాల్లో అధికారం చేతులు మారినపుడు ఫైళ్లు చోరీకి గురవుతూ ఉంటాయి. ఢిల్లీలో అలా జరగకూడదని బీజేపీ ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. ఈ మేరకు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ నోటీస్ జారీ చేశారు.

"ఎటువంటి ఫైల్స్, డాకుమెంట్స్, కంప్యూటర్ హార్డ్ వేర్ లాంటివి ఢిల్లీ సెక్రటేరియట్ కాంప్లెక్స్ నుంచి బయటికి తీసుకెళ్లడానికి అనుమతి లేదు. ఒకవేళ అత్యవసరమైతే జెనెరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్ మెంట్ నుంచి అనుమతి తీసుకోవడం తప్పనిసరి. ఈ విషయంలో సెక్రటేరియట్‌కు చెందిన అన్ని విభాగాల అధిపతులు చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతున్నాం" అంటూ ఢిల్లీ గవర్నర్ కార్యాలయం నుంచి నోటీసు జారీ అయింది.

## ఢిల్లీ అభివృద్ధిని పరుగులు తీయిస్తా: మోదీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: దశాబ్దం పాటు పాలన సాగించిన "ఆప్" ప్రభుత్వానికి ఉద్వాసన పలికి ఢిల్లీ ఓటర్లు బీజేపీకి పట్టం కట్టారు. 70 సీట్లలో బీజేపీ 48 సీట్లలో ఘనవిజయం సాధించడంతో పార్టీ ప్రధాన కార్యాలయంలో శనవారం సాయంత్రం విజయోత్సవం నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి పెద్దఎత్తున కార్యకర్తలు, నాయకులు స్వాగతం పలికారు. పార్టీ కార్యకర్తలు జెండాలు ఊపుతూ, నినాదాలు హోరెత్తింది. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఇతర సీనియర్ నేతలు ఈ విజయోత్సవంలో పాల్గొన్నారు.

ప్రధానమంత్రి "యమునా మాయి కీ జై" అనే నినాదంతో తన ప్రసంగాన్ని ప్రారంభించారు. ఆప్‌దా ప్రభుత్వం నుంచి విముక్తులై బీజేపీ పాలనా శకం ప్రారంభం కానుండటంతో ఢిల్లీ ప్రజలు ఎంతో ఉపశమనంతో, ఉల్లాసంగా ఉన్నారని అన్నారు. "21వ శతాబ్దంలో సేవ చేసుకునే భాగ్యం కల్పించాలని ఢిల్లీ వాసులందరికీ లేఖ రాశాను. ఈరోజు ఢిల్లీ ప్రజలంతా నాపై విశ్వాసం ఉంచినందుకు శిరస్సు వంచి అభివాదం చేస్తున్నాను. ప్రజలంతా ఎంతో ప్రేమతో ఆశీర్వదించారు. ఇందుకు ప్రతిగా ఢిల్లీ శ్రీఘ్ర అభివృద్ధికి పాటుపడతానిని హామీ ఇస్తున్నాను" అని మోదీ అన్నారు.

## అబద్ధాలు, మోసం, అవినీతి పాలనకు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు మంగళం పాడాయి

### -కేంద్ర హోం మంత్రి అమిత్ షా

న్యూఢిల్లీ ఫిబ్రవరి 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్ )ల; : ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను కేంద్ర హోం మంత్రి అమిత్ షా శనివారం శ్లాఘించారు. దేశ రాజధానిలో ఎన్నికల ఫలితాలు అభివృద్ధికి ఆరంభాన్ని ఇస్తాయి అన్నారు. అబద్ధాలు, మోసం, అవినీతి పాలనకు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు మంగళం పాడాయని అన్నారు. ఇదిలావుండగా 27 ఏళ్ల తర్వాత ఢిల్లీలో మళ్లీ బిజెపి అధికారంలోకి రావడంతో కాషాయ పార్టీ క్యాంప్‌లో ఆనందం వెల్లివిరిసింది. బిజెపి నాయకులు ప్రధాని నరేంద్ర మోడీ పాలనను కొనియాడారు. భారత అభివృద్ధికి ఢిల్లీ అభివృద్ధి చాలా అవసరమని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభిప్రాయ పడ్డారు. ఢిల్లీలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అభివృద్ధిని కొత్త గరిష్ఠ స్థాయిలకు తీసుకెళ్లగలదని ఆయన తన 'ఎక్స్'పోస్ట్‌లో పేర్కొన్నారు. చేసిన ఎన్నికల వాగ్దానాలు నెరవేర్చడానికి, ప్రపంచంలో అగ్ర రాజధానిగా ఢిల్లీని నిలబెట్టడానికి బిజెపి కృతనిశ్చయంతో ఉన్నదని ఆయన అన్నారు. ఆమ్ ఆద్మీ తప్పుడు వాగ్దానాలకు, యమునా నది కాలుష్యానికి, మురికి త్రాగు నీరు, రోడ్లు గుంటలుపడిపోవడానికి, ప్రతి వీధిలో మద్యం షాపులు తెరుచుకోవడానికి ఢిల్లీ ఓటర్లు గుణపాఠం చెప్పారని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. కాగా బిజెపి ఘనవిజయం ప్రజల విజయం అని బిజెపి అధ్యక్షుడు జెపి.నడ్డా అభిప్రాయపడ్డారు. అవినీతి విషయంలో 'ఆపద' ప్రభుత్వం అన్ని హద్దులను చెరిపేసిందని అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ విజన్ నమ్మిన ప్రజలు చారిత్రాత్మక తీర్పునిచ్చారని నడ్డా అన్నారు.

## ఆటలు ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తాయి..

### -ప్రభుత్వం ఆటలకు అధిక ప్రాధాన్యత ఇస్తుంది-సుడా ఛైర్మన్ నరేందర్ రెడ్డి

కరీంనగర్, ఫిబ్రవరి 8: (నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ జిల్లాలో కొత్తపల్లి మండలంలోని చింతకుంట శ్రీ చైతన్య సీబీఎస్ఈ సిఓఐపీఎల్ పాఠశాలలో శనివారం ఘనంగా కరీంనగర్, మంచిర్యాల, సిద్దిపేట, నిజామాబాద్ జోనల్స్ లెవెల్ రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు కరీంనగర్ సీబీఎస్ఈ సీఈఓ ఐపీఎల్ ప్రిన్సిపాల్ రాజ్ కుమార్ ఆచార్య జెండా ఊపి రాష్ట్ర స్థాయి పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులందరూ చదువులోనే కాదు ఆటలలో కూడా రాణించడానికి ఇటువంటి ఆటల పోటీలు దోహదపడతాయని అన్నారు. నేడు రాష్ట్రస్థాయిలో మరియు జాతీయస్థాయిలో మన రాష్ట్ర నుంచి అనేకమంది ప్రతిభను కనబరుస్తున్నారని శ్రీ చైతన్య పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు శ్రీలంక మరియు థాయిలాండ్ లో జరిగిన చేస్బోబర్ జాతీయస్థాయి పోటీలలో



శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థిని సహస్ర క్రికెట్ అండర్ 19 వరల్డ్ కప్ లో మన రాష్ట్రం నుంచి త్రిష అనే అమ్మాయి జాతీయస్థాయిలో వరల్డ్ కప్ సాధించడంలో కీలకపాత్ర పోషించడం గర్వించదగ్గ విషయం అన్నారు. విద్యార్థులు మానసికంగ మరియు శారీరకంగా అభివృద్ధి చెందాలంటే వాళ్లకి ఆటలు అనేది అవసరమని గెలుపు ఓటములు సహజమని విద్యార్థిని విద్యార్థులు అందరూ క్రీడా స్ఫూర్తిని కొనసాగిస్తూ చదువుల్లో కూడా రాణించాలని నరేందర్ రెడ్డి అన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్న జట్లు కబడ్డీ, కొక్కో, వాలీబాల్, త్రో బాల్, చెస్, క్యారం, 100 మీటర్స్ రన్నింగ్. దాదాపు 60 బ్రాంచుల నుండి, కరీంనగర్ మంచిర్యాల నిజామాబాద్ సిద్దిపేట జోన్ల నుంచి దాదాపు 600 మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు గెలిచిన జట్లు అందరికీ నరేందర్ రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ సీబీఎస్ఈ సివో ఐపిఎల్ ప్రిన్సిపాల్ రాజకుమార్ ఆచార్య గెలుపొందిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం .శ్రీ చైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ సీమా మేడం జిఎం నాగేంద్ర ఛైర్మన్ శ్రీధర్ డైరెక్టర్ శ్రీవిద్యా కరీంనగర్ జోన్ ఏజీఎం ఏం రాజు మంచిర్యాల జోన్ ఏజీఎం అరవింద్ రెడ్డి సిద్దిపేట జోన్ ఏజిం మధుసూదన్ రెడ్డి నిజామాబాద్ జోన్ ఏజీఎం సతీష్ రెడ్డి ఏజిఎం సదాశివరెడ్డి జోనల్ అకాడమిక్ కోఆర్డినేటర్ ప్రవీణ్ కొత్తపల్లి ఎంఈవో ఆనంద్ చింతకుంట మాజీ సర్పంచ్ సమ్మయ్య, స్థానిక నాయకులు శ్రవణ్ నాయక్, దండి రవీందర్,అస్థపురం తిరుమల ,స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడానికి మరియు వాతావరణ మార్పులకు వ్యతిరేకంగా స్థితిస్థాపకతను ప్రోత్సహించడానికి చర్యలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:ICAR ఫ్లాగ్‌షిప్ నెట్‌వర్క్ ప్రాజెక్ట్ 'నేషనల్ ఇన్నోవేషన్స్ ఇన్ క్లైమేట్ రెసిలెంట్ అగ్రికల్చర్' ద్వారా ప్రభుత్వం దేశవ్యాప్తంగా విస్తరించి ఉన్న 151 వాతావరణ దుర్బలమైన జిల్లాలలో వాతావరణాన్ని తట్టుకునే వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసి ప్రోత్సహిస్తుంది, ఇవి కరువు, వరదలు, మంచు, హీట్‌వేవ్‌లు మొదలైన వాతావరణ మార్పుల నేపథ్యంలో సవాళ్లను ఎదుర్కొంటాయి. వాతావరణ స్థితిస్థాపక సాంకేతికతలు అంటే, వాతావరణాన్ని తట్టుకోగల రకాలు, అంతర పంటల వ్యవస్థలు, పరిరక్షణ వ్యవసాయం, పంటల వైవిధ్యీకరణ, వ్యవసాయ అటవీ వ్యవస్థలు, సున్నా వరకు విత్తడం, పచ్చిరొట్ట, సమీకృత వ్యవసాయ వ్యవస్థలు, సమీకృత పోషకాలు మరియు తెగుళ్ల నిర్వహణ, సేంద్రీయ వ్యవసాయం, సైట్ నిర్దిష్ట పోషకాల నిర్వహణ, నీటిపారుదల, నీటిపారుదల పరిరక్షణ పద్ధతులు. రైతుల భాగస్వామ్య విధానం ద్వారా పెద్ద సంఖ్యలో రైతులకు అభివృద్ధి చేసి ప్రదర్శించారు. ఇంకా, ఈ సాంకేతికతలు 23 రాష్ట్రాలు మరియు 3 కేంద్ర పాలిత ప్రాంతాల కోసం డాక్యుమెంట్ చేయబడ్డాయి మరియు రాష్ట్రాలలో కొనసాగుతున్న పథకాలతో మరింత మెరుగుదల మరియు కలయిక కోసం రాష్ట్ర శాఖలతో భాగస్వామ్యం చేయబడ్డాయి.

# చిత్తడి నేలల పరిరక్షణతోనే జీవవైవిధ్య సంరక్షణ

నేలపై అన్ని కాలాల్లో నీరు నిలువ ఉండగల చిన్న లేదా పెద్ద ప్రాంతాలను 'చిత్తడి నేలలు' లేదా 'వెట్‌ల్యాండ్స్' అని పిలుస్తాం. చిత్తడి నేలలు పౌర సమాజానికి, జంతు వృక్ష జాలానికి అనేక ప్రయోజనాలను కల్పిస్తూనే పలు ఇతర సేవలను అందిస్తాయి. సరళ మానవ జీవనానికి చిత్తడి నేలల పరిరక్షణ అతి ముఖ్యం. మానవ తప్పిదాలు, అవగాహన లోపాలతో చిత్తడి నేలల వైశాల్యం క్రమంగా తరగడంతో వాటి పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం అనే లక్ష్యాలను అధిగమించడానికి ప్రతి ఏట 02 ఫిబ్రవరి రోజున విశ్వ మానవాళి "ప్రపంచ చిత్తడి నేలల దినం (వరల్డ్ వెట్‌ల్యాండ్స్ డే)" నిర్వహించుట ఆనవాయితీగా మారింది. 1997 నుంచి ఐరాస నేతృత్వంలో నిర్వహిస్తున్న ప్రపంచ చిత్తడి నేలల దినం-2025 నినాదంగా "పౌర సమాజ భవిష్యత్తుకు చిత్తడి నేలల పరిరక్షణ" అనే అంశాన్ని ఇతివృత్తంగా తీసుకోవడం జరిగింది. మానవాళికి, భూగోళానికి అనేక ప్రయోజనాలను కలిగిస్తున్న చిత్తడి నేలల రక్షణ బాధ్యతలను తీసుకోవడం ప్రభుత్వాల, ప్రజల కనీస కర్తవ్యమని తెలపడానికి ఈ వేదికలు ఉపయోగించుకోవడం కొనసాగుతుంది.

## ప్రపంచవ్యాప్తంగా "రామ్సర్ చిత్తడి నేలల" గుర్తింపు:

1700 సంవత్సరం నుంచి నేటి వరకు దాదాపు 90 శాతం వరకు చిత్తడి నేలలు తరిగిపోయాయని, గత 50 ఏండ్లలో 30 శాతం తగ్గాయని ఆధునిక అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. చిత్తడి నేలల ప్రయోజనాలను గుర్తించిన ప్రపంచ దేశాలు వాటి పరిరక్షణ ప్రాధాన్యతలను చర్చించడానికి 02 ఫిబ్రవరి 1971న "చిత్తడి నేలల సదస్సు" లేదా "రామ్సర్ సదస్సు" తొలిసారి నిర్వహించి పలు మార్గదర్శకాలను రూపొందించింది. దీనికి తోడుగా ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన చిత్తడి నేలలను గుర్తించి "రామ్సర్ చిత్తడి నేలలు"గా ఒక జాబితా తయారు చేయడం జరిగింది. ఇప్పటి వరకు ప్రపంచవ్యాప్తంగా 2,400 చిత్తడి నేలల ప్రాంతాలను గుర్తించారు. అందులో 85 రామ్సర్ చిత్తడి నేలలు భారత్‌లో ఉన్నారు. భారత దేశంలో అత్యధికంగా తమిళనాడులో 18, యూపీలో 10 ఉండగా, మన తెలుగు రాష్ట్రాల్లో ఆంధ్ర ప్రదేశ్‌లోని కొల్లూరు సరస్సు మాత్రమే రామ్సర్ సైట్‌గా గుర్తింపు పొందింది. అటవీ ప్రాంతాలతో పోల్చితే చిత్తడి నేలలు మూడు రెట్లు అధిక వేగంతో తరిగిపోవడం గమనించారు.

## చిత్తడి నేలల ప్రధాన బహుళ ప్రయోజనాలు:

చిత్తడి నేలల ముఖ్య ప్రయోజనాల్లో నేల కోతలను అరికట్టడం, జీవ వైవిధ్య పరిరక్షణ, అనేక జంతువులు/వృక్షాలు/పక్షులకు ఆనవాలుగా పని చేయడం, నీటి సంరక్షణ, నీటి శుద్ధి, సాంస్కృతిక క్షేత్రాలుగా ఉపయోగపడడం, మానవాళి శ్రేయస్సు, నీటి సరఫరా, జీవావరణ వ్యవస్థలను కాపాడడం, జీవనోపాధిని కల్పించడం, ఉద్యోగాల కల్పన, తుఫానుల సమయంలో అధిక నష్ట నివారణ, కార్బన్ నిల్వలు పెంచడం, వాతావరణ సానుకూల మార్పులకు దోహదపడటం, మానవ శారీరక మానసిక ఆరోగ్య సంరక్షణ, పర్యాటకాభివృద్ధి, వినోద ప్రదేశాలుగా సేవలు అందించడం లాంటివి వస్తాయి. చిత్తడి నేలలను ఆవాసాలుగా చేసుకొని వృక్ష జాతులు, చేపలు, ఉభయచరాలు, సరీసృపాలు, క్షీరదాలు, పక్షులు లాంటి అనేక జీవులు మనగలుగుతున్నాయి.

జీవావరణ వ్యవస్థలో అతి సున్నితమైన చిత్తడి నేలలు పర్యావరణ, వాతావరణ మార్పులతో సులభంగా ప్రభావితం అవుతాయని గమనించాలి. ఏ చిన్న ప్రతికూల మార్పు వచ్చినా

చిత్తడి నేలలు వేగంగా ప్రమాదకర స్థాయిలో కరిగిపోతాయని తెలుసుకోవాలి. చిత్తడి నేలల పరిరక్షణకు మనం తీసుకుంటున్న చర్యలను సమీక్షించుకుంటూ, వాటిని కాపాడుకోవడానికి శాశ్వత చర్యలను తీసుకుంటూ, మన ఆరోగ్యకర మనుగడకు మనమే పునాదులు వేసుకుందాం, చిత్తడి నేలలను చిత్తశుద్ధితో పరిరక్షించుకుందాం.

-డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# స్కిల్ ఇండియా కార్యక్రమం కొనసాగింపు, పునఃవ్యవస్థీకరణకు మంత్రిమండలి ఆమోదం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర మంత్రివర్గం 2022-23 నుంచి 2025-26 వరకు రూ.8,800 కోట్ల నిధులతో కేంద్ర ప్రభుత్వ పథకం- స్కిల్ ఇండియా ప్రోగ్రామ్ (సిప్)ను కొనసాగించడానికి, పునర్వ్యవస్థీకరించడానికి ఆమోదం తెలిపింది.

ఈ నిర్ణయం దేశవ్యాప్తంగా డిమాండ్ ఆధారిత, సాంకేతిక ఆధారిత, పరిశ్రమ-ఆధారిత శిక్షణను ఏకీకృతం చేయడం ద్వారా నైపుణ్యం కలిగిన, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న శ్రామిక శక్తిని నిర్మించడానికి ప్రభుత్వ నిబద్ధతను తెలియచేస్తుంది.

ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన 4.0 (పిఎంకెవివై 4.0), ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్ షిప్ ప్రమోషన్ స్కీమ్ (పిఎం-ఎన్ఎపిఎస్), జన్ శిక్షన్ సంస్థాన్ (జెఎస్ఎస్) పథకం- ఈ మూడు ప్రధాన భాగాలను ఇప్పుడు సమగ్ర కేంద్ర ప్రభుత్వ పథకం అయిన "స్కిల్ ఇండియా ప్రోగ్రామ్" కింద కలిపారు. ఈ కార్యక్రమాలు నిర్మాణాత్మక నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ శిక్షణ, సామాజిక ఆధారిత విద్యను అందించడం లక్ష్యంగా కలిగి ఉన్నాయి. దీని ద్వారా పట్టణ, గ్రామీణ ప్రజలు, అలాగే అణగారిన వర్గాలు కూడా మెరుగైన వృత్తి విద్యను పొందేలా చేయడమే ఉద్దేశం. స్కిల్ డెవలప్మెంట్ అండ్ ఎంటర్ ప్రెన్యూర్ షిప్ మంత్రిత్వ శాఖ మూడు అత్యంత ప్రాధాన్య పథకాల కింద, ఇప్పటి వరకు 2.27 కోట్లకు పైగా లబ్ధిదారులు ఉన్నారు.

ప్రధాన్ మంత్రి కౌశల్ వికాస్ యోజన 4.0 (పి ఎమ్ కె వి వై 4.0) పథకం, 15 నుండి 59 సంవత్సరాల వయస్సు గల లబ్ధిదారులను లక్ష్యంగా చేసుకుని, నేషనల్ స్కిల్స్ క్వాలిఫికేషన్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ ఎస్ క్యు ఎఫ్ ) కు అనుగుణంగా, షార్ట్-టర్మ్ ట్రైనింగ్ (ఎస్ ఐ టి ), స్పెషల్ ప్రాజెక్ట్స్ (ఎస్ పి ), ముందస్తు అభ్యాస గుర్తింపు (ఆర్ పి ఎల్ ) ద్వారా నైపుణ్యాల పెంపును అందిస్తుంది. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన 4.0 పథకం పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా, పెరిగిన డిమాండ్ తో జాతీయ ప్రాధాన్యతలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి శిక్షణను అందించే విధంగా రూపాంతరం చెందింది. ఈ పథకంలో ఒక ముఖ్యమైన మార్పు ఏమిటంటే, స్వల్ప వ్యవధి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల్లో అనుభవాధారిత శిక్షణ (ఒజెటి)ను ఏకీకృతం చేయడం. ఇందువల్ల శిక్షణార్థులు వాస్తవ ప్రపంచ అనుభవం, పరిశ్రమ అనుభవాన్ని పొందగలుగుతారు. పెరుగుతున్న పరిశ్రమ డిమాండ్లు, కొత్త తరం టెక్నాలజీకి అనుగుణంగా, కృత్రిమ మేధ, 5 జి టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ, గ్రీన్ హైడ్రోజన్, డ్రోన్ టెక్నాలజీపై 400 పైగా కొత్త కోర్సులను ప్రవేశపెట్టారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, భవిష్యత్తు నైపుణ్యాలపై దృష్టి సారించారు.

మిశ్రమ, సౌలభ్యవంతమైన విద్యా నమూనా ఇప్పుడు డిజిటల్ డెలివరీని సమీకరించి, శిక్షణను మరింత సౌలభ్యవంతంగా, విస్తరించగలిగే విధంగా మారుస్తుంది. పరిశ్రమకు అనుగుణమైన లక్ష్యబద్ధమైన నైపుణ్యాలను అందించేందుకు, శిక్షణార్థులు తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడానికి, పునర్నైపుణ్యాన్ని పొందడానికి, అధిక డిమాండ్ ఉన్న ఉద్యోగి పాత్రలలో ఉద్యోగావకాశాలను మెరుగుపరచుకోవడానికి ఈ కార్యక్రమం 7.5 గంటల నుండి 30 గంటల వరకు వ్యవధి కలిగిన మైక్రో-క్రెడెన్షియల్, నేషనల్ ఆక్యుపేషనల్ స్టాండర్డ్స్ (ఎన్ఓఎస్) ఆధారిత కోర్సులను ప్రవేశపెడుతుంది.

ప్రస్తుతం ఉన్న మౌలిక సదుపాయాలను సద్వినియోగం చేసుకోవడానికి, నాణ్యమైన శిక్షణను విస్తరించడానికి, ఐటిఐలు, ఎన్ఐటీలు, జవహర్ నవోదయ విద్యాలయాలు (జెఎన్వి), కేంద్రీయ విద్యాలయాలు, సైనిక్ పాఠశాలలు, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ (ఇఎంఆర్ఎస్), పిఎం శ్రీ స్కూల్స్, టూల్రూమ్స్, నైలెట్, సిపెట్ వంటి ప్రముఖ విద్యా సంస్థలలో స్కిల్ హబ్ లను ఏర్పాటు చేశారు.

శిక్షణలో నాణ్యత, మూల్యాంకనలను బలోపేతం చేయడానికి, శిక్షణ కేంద్రాల మధ్య ప్రమాణీకరణ, నైపుణ్యాన్ని పెంపొందించేందుకు లక్ష మంది మూల్యాంకనకర్తలు, శిక్షకులతో కూడిన- నేషనల్ పూల్ ను అభివృద్ధి చేస్తున్నారు. పరిశ్రమ భాగస్వామ్యాలు రిక్రూట్, ట్రెయిన్, డిప్లాయ్ (ఆర్ టి డి) శిక్షణ ద్వారా ఉద్యోగావకాశాలకు ప్రవేశాన్ని సులభతరం చేస్తాయి.

ఇంకా ఈ పథకం అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగ ప్రయాణాలకు ప్రాముఖ్యతను పెంచుతుంది. దీని ద్వారా భారతీయ కార్మికులు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన నైపుణ్యాలతో సిద్ధంగా ఉంటారు. మంత్రిత్వ శాఖ వివిధ దేశాలతో మొబిలిటీ భాగస్వామ్య ఒప్పందాలు (ఎంఎంపిఎ), అవగాహనా ఒప్పందాలు కుదుర్చుకుంది. అవసరమైన రంగాలలో నైపుణ్య లోపాలపై అధ్యయనాలు కూడా నిర్వహించింది. ఈ పథకం కింద, మన శ్రామిక శక్తికి అంతర్జాతీయ చలనశీలత అవకాశాలను పెంచడానికి డొమైన్ స్కిల్స్, జాయింట్ సర్టిఫికేషన్లు, భాషా ప్రావీణ్యం, సాఫ్ట్ స్కిల్స్ లో శిక్షణను ప్రారంభించారు.

పిఎంకెవివై 4.0 కింద, అన్ని ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయాన్ని ప్రేరేపించేందుకు 'మొత్తం ప్రభుత్వం' అనే దృక్కోణాన్ని అవలంబించారు. తద్వారా ఆయా రంగాలలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిరవధికంగా అమలు అవుతాయి. ఈ పథకం వివిధ నైపుణ్యాభివృద్ధి, ఎంటర్ ప్రెన్యూర్ షిప్ పథకాల లో నైపుణ్య భాగాలను అందిస్తూ, దాని ప్రభావాన్ని, వనరుల సామర్థ్యాన్ని గరిష్ఠంగా పెంచుతుంది. ప్రధాన భాగస్వామ్యాల్లో, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ కింద పీఎం విశ్వకర్మ, పీఎం సూర్య ఘర్: ముఫ్త్ బిజ్లీ యోజన, నూతన, పునరుత్పాదక ఇంధన చెందిన నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్, నల్ జల్ మిత్ర మొదలైనవి ఉన్నాయి.

సామర్థ్యాన్ని పెంపొందించడానికి, రంగాల వారీగా నైపుణ్య అంతరాలు, పరిశ్రమ అవసరాలను సమర్థంగా గుర్తించడానికి డిమాండు మదింపు వ్యూహాన్ని పునర్వ్యవస్థీకరించడంతో సహా విధానపరమైన మార్పులు ప్రవేశపెట్టారు. పిఎంకెవివై 4.0 లో ఒక కీలక సంస్కరణ "ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్" విధానం. ఇది షరతుల భారాన్ని గణనీయంగా తగ్గించింది. ఈ పథకంలో భాగస్వామ్యాన్ని మరింత క్రమబద్ధీకరించి, సమర్థవంతంగా మార్చింది.

నేషనల్ పాలసీ ఆన్ స్కిల్ డెవలప్మెంట్ అండ్ ఎంట్రెప్రెన్యూర్‌షిప్ -2015 భారతదేశంలో నైపుణ్య కార్మిక శక్తిని సృష్టించేందుకు అప్రెంటీషిప్‌పై ప్రధానంగా దృష్టి పెట్టింది. వాస్తవ ఉద్యోగ ప్రదేశంలో పనిచేసే యువతకు నైపుణ్యాలను అందించేందుకు, కొంత వేతనం సంపాదిస్తూ ఆర్థిక సహాయం పొందేందుకు అప్రెంటీషిప్ శిక్షణ ప్రధాన పాత్ర పోషిస్తుంది. అంతర్జాతీయంగా కూడా, శిక్షణతో నేర్చుకుంటూ సంపాదించే అత్యుత్తమ నమూనాగా అప్రెంటీషిప్‌ను పరిగణిస్తారు.

ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటీషిప్ ప్రమోషన్ స్కీమ్ (పిఎం- ఎన్ఎపిఎస్) విద్య నుండి ఉద్యోగంలోకి నిరవధిక మార్పిడికి మద్దతు ఇస్తుంది. దీని ద్వారా అప్రెంటీస్‌లు వాస్తవ ప్రపంచ అనుభవం ద్వారా పరిశ్రమకు అవసరమైన నిర్దిష్ట నైపుణ్యాలను సంపాదించగలుగుతారు. భారతదేశంలోని అప్రెంటిస్‌లు, సంస్థలు రెండింటికీ మద్దతు ఇవ్వడానికి, కేంద్ర ప్రభుత్వం శిక్షణ కాలంలో స్టైపెండ్ లో 25 శాతం అంటే ప్రతి అప్రెంటిస్‌కు నెలకు రూ.1,500 వరకు ప్రత్యక్ష ప్రయోజన బదిలీ ద్వారా అందిస్తుంది. ఈ పథకాన్ని 14 నుండి 35 సంవత్సరాల వయస్సు గల వ్యక్తుల కోసం రూపొందించారు. ఇది వివిధ తరగతుల జనాభాలో నైపుణ్య అభివృద్ధి అవకాశాలను సమగ్రంగా పెంపొందిస్తుంది.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, బ్లాక్ చెయిన్, గ్రీన్ ఎనర్జీ, ఇండస్ట్రీ 4.0 టెక్నాలజీలు వంటి అభివృద్ధి చెందుతున్న రంగాలతో సహా ప్రస్తుత తయారీ రంగంలో అప్రెంటిషిప్ అవకాశాలను ఎన్ఎపిఎస్ ప్రోత్సహిస్తుంది. ఇది భవిష్యత్తు ఉద్యోగ మార్కెట్లు, పరిశ్రమ ధోరణులతో నైపుణ్య కార్యక్రమాలను సమీకృతం చేస్తుంది. చిన్న సంస్థల్లో ముఖ్యంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈలు), ఆకాంక్షాత్మక జిల్లాలు, ఈశాన్య ప్రాంతం వంటి నిరుపేద ప్రాంతాల్లో ఉన్న అప్రెంటిస్ల నమోదును ఈ పథకం ప్రోత్సహిస్తుంది.

జన్ శిక్షన్ సంస్థన్ (జెఎస్ఎస్) పథకం అనేది వృత్తి శిక్షణను అందుబాటులో, సరళమైన, సమ్మిళితంగా చేయడానికి రూపొందించిన సమాజ కేంద్రీకృత నైపుణ్య చొరవ. ముఖ్యంగా మహిళలు, గ్రామీణ యువత, ఆర్థికంగా వెనుకబడిన సమూహాలకు ఇంకా 15 - 45 సంవత్సరాల వయస్సు గల వారికి సేవలు అందిస్తుంది. తక్కువ ఖర్చుతో, ఇళ్ల వద్దనే శిక్షణను సౌలభ్యవంతమైన సమయావళితో అందించడం ద్వారా, జెఎస్ఎస్ అవసరమైన వారికి నైపుణ్య అభివృద్ధి అవకాశాలను చేరవేసి, స్వయం ఉపాధి, వేతన ఆధారిత జీవనోపాధులను ప్రేరేపిస్తుంది. నైపుణ్య అభివృద్ధి మించి, ఈ కార్యక్రమం సామాజిక సాధికారతలో కీలక పాత్ర పోషిస్తుంది. ఇది సమాజంలో ఆరోగ్యం, శుభ్రత, ఆర్థిక సాక్షరత, లింగ సమానత్వం, విద్యపై అవగాహన కల్పిస్తుంది. జె ఎస్ ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పి ఎం జన్ మన్, అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ (ఉల్లాస్) వంటి కీలక ఉద్యమాలతో అనుసంధానమై, సమగ్ర నైపుణ్యాభివృద్ధిని ప్రోత్సహిస్తుంది.

జాతీయ ప్రణాళికలకు అనుగుణంగా, స్కిల్ ఇండియా కార్యక్రమం కింద ఉన్న అన్ని సర్టిఫికేషన్ లను నేషనల్ స్కిల్స్ క్వాలిఫికేషన్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ ఎస్ క్యూఎఫ్)కు అనుసంధానం చేశారు. డిజిలాకర్, నేషనల్ క్రెడిట్ ఫ్రేమ్ వర్క్ (ఎన్ సీఆర్ ఎఫ్)లతో అనుసంధానం చేయడం ద్వారా నైపుణ్యాలకు అధికారిక గుర్తింపు లభించి, ఉద్యోగం,ఉన్నత విద్యలో సజావుగా మార్పిడి సాధ్యమవుతుంది.

స్కిల్ ఇండియా ప్రోగ్రామ్ కొనసాగింపుతో, ప్రభుత్వం వేగంగా మారుతున్న ఉపాధి రంగంలో నిరంతర నైపుణ్యాల అభివృద్ధి, పునర్నైపుణ్యాలను పొందడం ప్రాముఖ్యతను గుర్తిస్తూ, జీవితకాల అభ్యాసానికి తన నిబద్ధతను బలోపేతం చేయడానికి ప్రయత్నిస్తుంది.పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పిఎల్ఎఫ్ఎస్) డేటాకు ఈ చొరవ నేరుగా దోహదం చేస్తుంది, శ్రామిక అభివృద్ధి విధానాలు ఆర్థిక, పారిశ్రామిక ధోరణులకు అనుగుణంగా ఉండేలా చేస్తుంది.

శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వృద్ధి చెందడానికి అవసరమైన నైపుణ్యాలతో భారత శ్రామిక శక్తిని సన్నద్ధం చేయడంలో స్కిల్ ఇండియా కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుంది. పరిశ్రమ-సంబంధిత శిక్షణ, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, అంతర్జాతీయ మొబిలిటీ చొరవలను ఏకీకృతం చేయడం ద్వారా, ఈ కార్యక్రమం అధిక నైపుణ్యంతో పోటీకి దీటైన శ్రామిక శక్తిని సృష్టించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఆర్థిక సాధికారతకు కీలక చోదకశక్తిగా స్కిల్ ఇండియా అన్ని రంగాల్లో ఉపాధి కల్పన, వ్యవస్థాపకత, ఉత్పాదకత పెంపునకు దోహదం చేస్తుంది. వృత్తి విద్యను బలోపేతం చేయడానికి, అప్రెంటిషిప్ అవకాశాలను విస్తరించడానికి, జీవితకాల విద్యను ప్రోత్సహించడానికి స్కిల్ డెవలప్మెంట్ అండ్ ఎంటర్ ప్రెన్యూర్ షిప్ మంత్రిత్వ శాఖ (ఎం ఎస్ డి ఇ) కట్టుబడి ఉంది. భారతదేశ కార్మిక శక్తి భవిష్యత్తుకు సిద్ధంగా ఉండి, నైపుణ్య ఆధారిత ఉద్యోగాల్లో అంతర్జాతీయ నాయకత్వ స్థానంలో నిలబడుతుంది.

## ఢిల్లీలో గెలుపుతో.. ప్రధాని పై విశ్వాసం మరోసారి రుజువైంది : పవన్

అమరావతి, ఫిబ్రవరి 8: ఢిల్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ విజయం సాధించడం ద్వారా ప్రధాని మోడీపై విశ్వాసం మరోసారి రుజువైందని జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు.

బీజేపీ విజయంపై స్పందిస్తూ.. "2047నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ నిలిచేలా మోడీ పాలన సాగిస్తున్నారు.

ఈ లక్ష్యాన్ని అందుకోవడంలో ఢిల్లీ పాత్ర అత్యంత కీలకం. డబుల్ ఇంజిన్ సర్కార్ ద్వారా ఢిల్లీలో సమ్మిళిత అభివృద్ధి సాధ్యపడుతుంది. అమితా రాజకీయ అనుభవం, చాతుర్యం సత్ఫలితాలు ఇచ్చాయి" అని అన్నారు.

## భారతదేశంలో ఎయిర్‌క్రాఫ్ట్ కాంపోనెంట్ తయారీని వేగవంతం చేయడంపై కేంద్ర మంత్రి రామ్ మోహన్ నాయుడు సమావేశం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి శ్రీ. దేశంలో ఎయిర్‌క్రాఫ్ట్ విడిభాగాల తయారీని సమీక్షించి, ముందుకు తీసుకెళ్లేందుకు రామ్ మోహన్ నాయుడు అధ్యక్షతన ఈరోజు ఉన్నతస్థాయి సమావేశం జరిగింది.

ఈ సమావేశంలో సెక్రటరీ ఎస్‌సి సహా ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఎ. వుల్నామ్, ౦౦ఎ చైర్మన్ గాప్త్ర. విపిన్ కుమార్, డిజిసిఎ డైరెక్టర్ జనరల్ షె. ఫైజ్ అహ్మద్ మరియు పరిశ్రమ సంఘాలు, ాఇఓలు, ఓఖీలు, పరిశోధనా సంస్థలు మరియు వివిధ ప్రభుత్వ శాఖల ప్రతినిధులు. దేశీయ ఉత్పత్తిని బలోపేతం చేయడం మరియు విమాన భాగాల తయారీ రంగంలో భారతదేశం యొక్క ప్రపంచ పోటీతత్వాన్ని పెంపొందించడంపై చర్చలు కేంద్రీకృతమై ఉన్నాయి.ప్రముఖ గ్లోబల్ ఏరోస్పేస్ సంస్థలతో వ్యూహాత్మక పొత్తులు మరియు విమాన ప్రయాణానికి పెరుగుతున్న డిమాండ్ కారణంగా భారతదేశం యొక్క ఎయిర్‌క్రాఫ్ట్ కాంపోనెంట్ తయారీ రంగం గణనీయమైన వృద్ధిని సాధిస్తోంది. ప్రధాన అంతర్జాతీయ ాఇఓలు మన దేశీయ పరిశ్రమ యొక్క అసాధారణమైన నాణ్యత మరియు విశ్వసనీయతను నొక్కిచెబుతూ భారతదేశం నుండి క్రమక్రమంగా భాగాలను పొందుతున్నాయి.

## కాల్‌కాజీలో ఆతిశీ అనూహ్య విజయం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:దేశరాజధాని ఢిల్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీకి బిగ్ షాక్‌లు తగులుతున్న సంగతి తెలిసిందే. అయితే వరుసగా ఆప్ అగ్రనేతలు అంతా వరుస ఓటమి పాలయ్యారు. ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, మాజీ సీఎం కేజ్రీవాల్, మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా, సత్యేంద్ర జైన్‌లు ఓటమి పాలయ్యారు. ఇలాంటి తరుణంలో ఆమ్ ఆద్మీ పార్టీకి కాస్త ఊరట నిచ్చేలా సీఎం అతిశీ గెలుపొందారు.

కాల్‌కాజీ నియోజకవర్గం నుంచి అతిశీ ఘన విజయం సాధించారు. బీజేపీ అగ్రనేత రమేశ్ బిధూరిని ఓడించారు. అతిశీ..రమేశ్ బిధూరిల మధ్య మొదటి నుంచి ఉత్కంఠ పోరు నడిచింది. చివరి రెండ రౌంట్లలో స్వల్ప ఓట్ల తేడాతో ఆమె గెలుపొం దారు.

## ప్రమాదవశాత్తు బావిలో పడి మహిళ మృతి..

అమరావతి, ఫిబ్రవరి 8:మండల పరిధిలోని రాంపల్లి గ్రామంలో ఇవాళ ఉదయం కూలీ పనికి వెళ్లిన మధులక్ష్మి (42) ప్రమాదవశాత్తు నీటి బావిలో పడి మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

మధులక్ష్మి నీటి కోసం బావి దగ్గరకు వెళ్లి నీళ్లు ముంచుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి బావిలోకి పడినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయాన్ని పక్కనే ఉన్న వారి బంధువు గమనించి బావిలో పడ్డ ఆమెను కాపాడాలని ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో ఆమె మరణించినట్లు గ్రామస్తులు తెలిపారు.

## ఎమ్‌జీఎన్ఆర్ఈజీఎస్‌లో రాష్ట్రాల బకాయి మొత్తాల చెల్లింపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (మహాత్మా గాంధీ ఎన్ఆర్ఈజీఎస్) గిరాకీని బట్టి వేతనాలతో కూడిన ఉపాధిని కల్పించే పథకం. కార్మిక బడ్జెటులో అంగీకరించిన ప్రకారం నిధులను రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు (యూటీలకు) విడుదల చేస్తుంటారు. రాష్ట్రాలకు, యూటీలకు నిధుల విడుదల నిరంతర ప్రక్రియ. క్షేత్ర స్థాయిలో పూర్తి చేయాల్సి ఉన్న పనులకు అనుగుణంగా ఈ పథకం అమలుకగాను రాష్ట్రాలకు, యూటీల కు నిధులను అందించడానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది. వేతన చెల్లింపులను లబ్ధిదారుల ఖాతాలోకి ప్రత్యక్ష ప్రయోజన బదలీ (డీబీటీ) ప్రోటోకాల్ ద్వారా కేంద్రం జమచేస్తుంది. అవసరమయ్యే సామగ్రి, పరిపాలక నిధి (మెటీరియల్ అండ్ అడ్మినిస్ట్రేషన్ ఫండ్)ను చట్ట నిబంధనావళి, మార్గదర్శక సూత్రాల ఆధారంగా రాష్ట్రాలకు, యూటీలకు విడుదల చేస్తుంటారు.

ప్రతి ఆర్థిక సంవత్సరం మొదట్లో, అంతకు ముందు సంవత్సరం ఏవైనా బాకీలు, పెండింగు మొత్తాల్ని చెల్లించవలసి ఉంటే వాటిని కేంద్ర ప్రభుత్వం సంబంధిత రాష్ట్రాలు, యూటీలకు చెల్లించి భర్తీ చేస్తుంది.

పశ్చిమ బెంగాల్ విషయంలో, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, 2005 లో 27వ సెక్షన్ నిబంధన ప్రకారం 2022 మార్చి నెల 9 నుంచి ఆ రాష్ట్రానికి నిధుల విడుదలను ఆపేశారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాలను ఆ రాష్ట్రం పాటించకపోవడమే దీనికి కారణం.

ఈ సమాచారాన్ని కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి శ్రీ కమలేశ్ పాస్‌వాన్ ఈ రోజు రాజ్య సభలో ఒక ప్రశ్నకు రాతపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో తెలిపారు.

# ఇంట్లో భారీ చోరీ.. 40తులాల బంగారం అపహరణ



అమరావతి, ఫిబ్రవరి 8:తాళం వేసిన ఇంటికి గుర్తుతెలియని దుండగులు కన్నం వేశారు. ఇంటి తాళాలు పగులగొట్టి సుమారు 40తులాల బంగారం ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. ఈ సంఘటన తాండూరు పట్టణం సాయిపూర్లో కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే? సాయిపూర్ కు చెందిన పట్లోళ్ల వెంకటేష్, సరళ దంపతులు ఈనెల 6న కుటుంబ సభ్యులతో కలిసి ధారూర్ మండలం నాగసానిపల్లిలో అక్క కుమారుడు పెళ్లి కోసం ఇంటికి తాళం వేసి వెళ్లారు. పెళ్లి కార్యక్రమాలు ముగించుకుని శనివారం ఉదయం 11 గంటలకు సాయిపూర్ లోని వారి నివాసానికి చేరుకున్నారు.

అప్పటికే ఇంటి తాళాలు పగలగొట్టి ఉండడంతో ఆందోళన గురయ్యారు. ఇంట్లోకి వెళ్లి చూడగా.. వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉండడంతో అంతా పరిశీలించగా, ఇంట్లో ఉన్న సుమారు 40తులాల బంగారం, ఆభరణాలు అపహరణకు గురైనట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, సిఐ సంతోష్ కుమార్, ఎస్సై రమేష్ లు బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. జరిగిన చోరీ గురించి వివరాలను ఆరా తీశారు. దీంతో ఈ సంఘటన స్థానికంగా కలకలం రేపింది. పరిశీలించిన పోలీసులు క్లూస్ టీమ్ ను రంగంలోకి దించే ప్రయత్నం చేస్తున్నారు.

# మాస్టర్ అథ్లెట్స్‌కు అభినందనలు తెలిపిన చైర్మన్ శివసేనారెడ్డి



హైదరాబాద్ ఫిబ్రవరి 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); కేరళ రాష్ట్రం, త్రిసూర్ గవర్నమెంట్ స్టేడియంలో జనవరి 31 నుండి ఫిబ్రవరి 3 వరకు జరిగిన నేషనల్ మాస్టర్ అథ్లెటిక్ టోర్నమెంట్ తెలంగాణ పతకాల పంట పండించింది. విజయం సాధించిన క్రీడాకారుల కు ఈరోజు ఎల్బీ స్టేడియం లోని చైర్మన్ శివసేనారెడ్డి కార్యాలయంలో సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ, 90, 80 ఏళ్ల వయసులో కూడా క్రీడల పట్ల ఆసక్తితో వివిధ రాష్ట్రాల్లో జరుగుతున్న టోర్నమెంట్ లో పాల్గొంటున్న మాస్టర్ అథ్లెట్లు భావితరాలకు తెలంగాణ యువ క్రీడాకారులకు ఆదర్శమని, వీరు సాధించిన విజయాలు యువ క్రీడాకారులకు స్ఫూర్తినిస్తున్నయని అన్నారు క్రీడాకారులు లో 95 ఏళ్ల వయసు గల పెద్దలు ఎం.ఎల్.ఎన్.రెడ్డి షాట్ పుట్ డిస్కస్ త్రో హామర్ త్రో లో మూడు బంగారు పతకాలు సాధించారు. అదేవిధంగా 83 ఏళ్ల వయసులో షాట్ పుట్ లో బంగారు డిస్కస్ త్రో రజతంహేమార్ త్రో లో కాంస్య పతకం సాధించి నందుకు స్పోర్ట్స్ అథారిటీ తరపున ప్రత్యేక అభినందనలు తెలియజేశారు

# యాదవుల ఆరాధ్య దైవం లింగమంతుల జాతర యాదవుల నేతృత్వం లో నిర్వహించాలి

### - తెలంగాణ రాష్ట్రం యాదవ సంఘం అధ్యక్షులు బయ్య వెంకటేశ్వర్లు యాదవ్

హైదరాబాద్ ఫిబ్రవరి 8 ();సూర్యాపేట జిల్లా దూరాజపల్లి లో అనేక ఏళ్లుగా నిర్వహిస్తున్న యాదవుల ఆరాధ్య దైవం శ్రీ శ్రీ లింగమంతుల స్వామి జాతర(గొల్ల గట్టు, పెద్దగట్టు జాతర)ను యాదవుల నేతృత్వం లో నిర్వహియించాలని ఆగ్ర కులం వారు ఆదిపత్యం చాలాయించకూడదని, తెలంగాణ రాష్ట్రం యాదవ సంఘం అధ్యక్షులు బయ్య వెంకటేశ్వర్లు యాదవ్ డిమాండ్ చేశారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే యాదవుల పవిత్రమైన కులదైవం శ్రీ శ్రీ లింగమంతుల స్వామి జాతరను యాదవుల పండుగలో రెడ్డిల ఆదిపత్యం కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. యాదవుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని అరకొర వసతులు కల్పిస్తూ రెడ్డిలు ఆదిపత్య చెలయాయిస్తు ప్రభుత్వం ఇస్తున్న నిధులను కాజేస్తున్నారని బయ్య వెంకటేశ్వర్లు ఆరోపించారు. ఫిబ్రవరి 16న జరగబోయే యాదవుల అతి పెద్ద జాతరకు ప్రభుత్వం కేటాయించిన నిధులు మా యాదవులచే కమిటీ వేసి వారిచే మాత్రమే నిర్వయించాలని ఆయన పేర్కొన్నారు. గతంలో జరిగిన పొరపాట్లు మళ్లీ జరిగితే ఉమ్మడి నల్లగొండ జిల్లా యాదవులమంతా ఆందోళన చేపడతాం బయ్య వెంకటేశ్వర్లు యాదవ్ హెచ్చరించారు.

వందల సంవత్సరాల చరిత్ర కలిగి ఉన్నా..

వందల సంవత్సరాల చరిత్ర కలిగి ఉన్నా.. శ్రీ శ్రీ లింగమంతుల స్వామి జాతర(గొల్ల గట్టు, పెద్దగట్టు జాతర) కు ఇంతవరకు ఒక్క ముఖ్యమంత్రి రాక పోవడం శోచనీయమన్నారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లోనే రెండో అతిపెద్ద జాతర శ్రీశ్రీశ్రీ లింగమంతుల స్వామి జాతర, గొల్ల గట్టు జాతర, పెద్దగట్టు జాతర ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం దురాజ్పల్లి అనే గ్రామంలో అంగరంగ వైభవంగా 5, 6 రాష్ట్రాల ప్రజలు, ముఖ్యంగా యాదవులు జరుపుకుంటారని తెలిపారు.ప్రతి పండుగకు 30 లక్షల మంది భక్తులు వచ్చి వారి ముక్కులను చెల్లించుకుంటారని తెలిపారు. సమ్మక్క సారక్క జాతరను గిరిజనుల ఆద్వర్యం లో నిర్వహిస్తున్నపుడు.. లింగమంతుల స్వామి జాతరను కూడా యాదవులచే నిరవహించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు.ఇకనైనా ప్రభుత్వం లింగమంతుల స్వామి జాతర పట్ల వివక్షతను విద్యానాదాలని కోరారు.బిఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాల పాలనలో ఐదు సార్ల జాతర జరిగిందని ఇందుకు ఒక 15 కోట్ల రూపాయల వరకు నిధులు ఇచ్చింది కానీ సమ్మక్క సారక్క జాతర మాదిరిగా ఏ ఒక్క శాశ్త్ర నిర్మాణం లేదన్నారు.

# మహాకుంభ్ 2025: ప్రయాగరాజ్ త్రివేణీ సంగమం వద్ద ఇప్పటి వరకూ 40 కోట్లకు పైగా భక్తుల పవిత్ర స్నానాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:మహాకుంభ్ 2025 లో భాగంగా, ఈ రోజు ఉదయం10 గంటల సమయానికి ప్రయాగరాజ్ వద్ద పవిత్ర స్నానం ఆచరించిన భక్తుల సంఖ్య 42 కోట్లను దాటింది. కుంభమేళా ముగిసేనదుకు మరో 19 రోజులు మిగిలి ఉండటంతో ఈ సంఖ్య 50 కోట్లకు చేరగలదని అంచనా వేస్తున్నారు.

విభిన్న సంస్కృతుల సమాహారం – మహాకుంభ్

మకర సంక్రాంతి, మౌని అమావాస్య, వసంత పంచమి పర్వదినాల సందర్భంగా చేసిన మూడు అమృత స్నానాల తరువాత కూడా భక్తుల్లో పవిత్ర నదీ స్నానం పట్ల ఆసక్తి ఎంత మాత్రం తగ్గుముఖం పట్టలేదు. దేశం, ప్రపంచం నలుమూలాల నుంచీ ప్రయాగరాజ్ కు చేరుకుంటున్న భక్తులు త్రివేణీ సంగమంలో పవిత్ర స్నానం ఆచరించేందుకు తరలివస్తున్నారు. వీరిలో 1 కోటి మందికి పైగా కల్పవాసీలు, భక్తులు, సాధువులు కూడా ఉన్నారు.

## భక్తజన సందోహం

మౌని అమావాస్య నాడు అత్యధిక సంఖ్యలో 8 కోట్లకు పైగా భక్తులు పవిత్ర స్నానం ఆచరించగా, మకర సంక్రాంతి నాడు 3.5 కోట్ల మంది త్రివేణీ సంగమం వద్ద మునక వేశారు. ఇక జనవరి 30, ఫిబ్రవరి 1న 2 కోట్ల మంది, పౌష్య పౌర్ణమి నాడు 1.7 కోట్ల మంది పవిత్ర స్నానాలు చేశారు. వసంత పంచమి పర్వదినం నాడు 2.5 కోట్ల మంది త్రివేణీ సంగమం వద్ద పుణ్యస్నానాలను ఆచరించారు.

ఇప్పటివరకూ పవిత్రస్నానం ఆచరించిన ప్రముఖులు

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ, హోం శాఖ మంత్రి శ్రీ అమిత్ షా, రక్షణ మంత్రి శ్రీ రాజనాథ్ సింగ్, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ (తన మంత్రివర్గ సహచరులతో సహా), ఇతర ప్రముఖ నేతలూ ఇప్పటి వరకూ సంగమంలో పవిత్ర స్నానం చేసిన వారిలో ఉన్నారు. ఫిబ్రవరి 10 వ తేదీన భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపదీ ముర్ము త్రివేణీ సంగమం వద్ద పుణ్య స్నానం ఆచారిస్తారని భావిస్తున్నారు.

పవిత్ర స్నానమాచరించిన ఇతర ప్రముఖులు: ఉత్తరప్రదేశ్ గవర్నర్ శ్రీమతి ఆనందీబెన్ పటేల్, రాజస్థాన్ గవర్నర్ శ్రీ భజన్ లాల్ శర్మ, హర్యానా ముఖ్యమంత్రి శ్రీ నాయాబ్ సింగ్ సైనీ, మణిపూర్ ముఖ్యమంత్రి శ్రీ ఎన్ బీరేన్ సింగ్, గుజరాత్ ముఖ్యమంత్రి శ్రీ భూపేంద్ర పటేల్. ఇక కేంద్ర మంత్రులు శ్రీ గజేంద్ర సింగ్ షఖావత్, శ్రీ అర్జున్ రామ్ మేఘ్వాల్, శ్రీ శ్రీపాద నాయక్ కుంభమేళాలో పవిత్ర స్నానాలను పూర్తి చేసుకున్నారు. పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సుధాంశు త్రివేది, శ్రీమతి సుధా మూర్తి, శ్రీ రవి కిషన్ లు కూడా పుణ్య స్నానాలు చేశారు.

సీనియర్ బీజేపీ నేతలు శ్రీ రవిశంకర్ ప్రసాద్, సమాజవాదీ పార్టీ జాతీయ అధ్యక్షుడు శ్రీ అఖిలేష్ యాదవ్, ఒలింపిక్ పతక విజేత సైనా నెహ్వాల్, ప్రముఖ కవి కుమార్ విశ్వాస్, క్రికెటర్ సురేష్ రైనా, అంతర్జాతీయ కుస్తీ యోధుడు ఖాలీ, నృత్య దర్శకుడు రెమో డిసూజా తదితరులు ప్రయాగరాజ్ లో జరుగుతున్న మహా కుంభ్ లో ప్రవిత్ర స్నానాలు ఆచరించారు.

# చీపురుతో ఆప్‌ను ఊడ్చేశారు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడుతున్నాయి. ఈ ఫలితాల్లో బీజేపీ అధికారం దిశగా దూసుకుపోతోంది. ప్రస్తుత ట్రెండ్స్ ప్రకారం మొత్తం 70 స్థానాల్లో 42 చోట్ల బీజేపీ ఆధిక్యంలో ఉంది. 28 చోట్ల ఆప్ లీడ్ లో ఉంది. కాంగ్రెస్ పార్టీ ఒక్క స్థానంలో కూడా పోటీ ఇవ్వలేకపోతోంది.

మరోవైపు ఎన్నికల ఫలితాలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పందిస్తూ ఢిల్లీలో కాషాయ జెండా ఎగురుతుందనేది ముందే ఊహించిందేనని చెప్పారు. ఢిల్లీ ప్రజలు ఆప్ ను చీపురుతో ఊడ్చేశారని అన్నారు. ప్రజలు ప్రజాస్వామ్యబద్ధమైన పాలనను కోలుకున్నారని అవినీతి, కుంభకోణాలు, జైలు పార్టీలు వద్దనుకున్నారని చెప్పారు. మేధావి వర్గం మొత్తం బీజేపీకే ఓటు వేసిందని తెలిపారు.

తెలంగాణలో జరుగుతున్న మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో కూడా బీజేపీ విజయం సాధిస్తుందని బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని మేధావి, ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గాలు ఆలోచించి ఓటు వేయాలని కోరారు. శాసనసభలో ప్రజల సమస్యలపై ప్రశ్నించేది బీజేపీ మాత్రమేనని చెప్పారు.

# రాష్ట్రంలో కాంగ్రెస్ నేతలకు అలాంటి పరిస్థితి ఉంది.. కేటీఆర్ షాకింగ్ కామెంట్స్



హైదరాబాద్, ఫిబ్రవరి 8:కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇప్పుడు ప్రజల్లోకి వెళ్లే పరిస్థితి లేదని.. ఒక వేళ వెళ్తే ప్రజలు తరిమి కొడతారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు విమర్శించారు. . ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా పోలీస్ సెక్యూరిటీ లేకుండా బయట తిరిగే అవకాశం లేదని చెప్పారు. ప్రజలు తిడుతున్న తిట్లకు రేవంత్ రెడ్డి కాకుండా వేరే వాళ్లు ఉంటే ఆత్మహత్య చేసుకునేవారని ఆరోపించారు. తెలుగు భాషలో ఉన్న అన్ని తిట్లను ప్రజలు కాంగ్రెస్ పార్టీని తిడుతున్నారని చెప్పారు. సిర్పూర్ కాగజ్‌నగర్ బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమావేశం ఇవాళ(శనివారం) తెలంగాణ భవన్‌లో జరిగింది. స్థానిక ఎన్నికలపై బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలకు కేటీఆర్ దిశానిర్దేశం చేశారు.

140ఎకరాల భూమి కోసం కొడంగల్‌లోని ఒక ఊరికి 450మంది పోలీసులను సీఎం రేవంత్ పంపించారని ఆరోపించారు. తెలంగాణలో పేదవాళ్లు బతుక వద్దా అని ప్రశ్నించారు. ఖచ్చితంగా వాళ్ల ఇళ్లను, దుకాణాలను రేవంత్ రెడ్డి కూలగొడతారని అన్నారు. అప్పుడప్పుడు సూర్యుడు కూడా మబ్బుల చాటుకు వెళ్తాడని.. కేసీఆర్ కూడా తప్పకుండా తిరిగి ప్రజల ఆశీర్వాదంతో మళ్లీ అధికారంలోకి వస్తారని తెలిపారు. సిర్పూర్ కాగజ్‌నగర్‌తో తనకు వ్యక్తిగతంగా అనుబంధం ఉందని తెలిపారు.కాగజ్ నగర్‌లో బీఆర్ఎస్‌ను బలోపేతం చేశామని అన్నారు. కాగజ్‌గర్ పేపర్ మిల్లును తెరిపించేందుకు అన్ని రకాలుగా ప్రయత్నం చేశానని గుర్తుచేశారు. కేసీఆర్‌తోనే బహుజనుల అభివృద్ధి జరుగుతుందని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నమ్మారని తెలిపారు. 8మంది చొప్పున కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు తెలంగాణ నుంచి గెలిచిన కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి తెచ్చింది శూన్యమని విమర్శించారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా ఇవ్వలేమని చెప్పినా.. ఒక్క కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు ఎందుకు నోరు మెదపలేదని నిలదీశారు. లోక్‌సభలో తాము ఉండుంటే కేంద్ర ప్రభుత్వంపై కొట్లాడే వారమని కేటీఆర్ తెలిపారు.

# బీజేపీ ఘన విజయం.. తెలుగు రాష్ట్రాల రాజకీయ ప్రముఖుల రియాక్షన్..



అమరావతి, ఫిబ్రవరి 8:ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం దాదాపు ఖరారు అయ్యింది. దీంతో దేశవ్యాప్తంగా బీజేపీ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నారు. టపాసులు కాలుస్తూ మిఠాయిలు తినిపించుకుంటున్నారు. తెలుగు రాష్ట్రాల్లోనూ కమలం పార్టీ నేతలు ఎగిరి గంతేస్తున్నారు. హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, విశాఖ, విజయవాడ, ఏలూరు, గుంటూరు సహా పలు ప్రాంతాల్లో సంబరాలు చేసుకుంటున్నారు. దాదాపు 27 ఏళ్ల తర్వాత ఢిల్లీ కోటపై కాషాయం పార్టీ జెండా ఎగరవేయనున్న నేపథ్యంలో పార్టీ శ్రేణుల ఆనందానికి అవధులు లేకుండా పోతున్నాయి. కాగా, బీజేపీ అఖండ విజయం సాధించడంతో తెలుగు రాష్ట్రాల మంత్రులు, కూటమి నేతలు, రాజకీయ ప్రముఖులు సైతం శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ అఖండ విజయం సాధించడం ప్రధాని నరేంద్రమోదీ పట్ల ఆ రాష్ట్ర ప్రజలకు ఉన్న అచంచల విశ్వాసానికి నిదర్శనమని ఏపీ వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఈ ఎన్నికల్లో కూటమి తరపున ప్రచారం చేసి విజయంలో ముఖ్య పాత్ర పోషించిన ఏపీ సీఎం చంద్రబాబుకి ధన్యవాదాలు తెలిపారు. ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత కేజ్రీవాల్‌తో సహా ఆ పార్టీ ముఖ్య నాయకుల్ని ఓడించి ప్రజాధనాన్ని దోచుకునే వారిని క్షమించబోమని ప్రజలు స్పష్టమైన తీర్పునిచ్చారని మంత్రి చెప్పుకొచ్చారు. అభివృద్ధి, సంక్షేమానికి అందలం ఎక్కించి, అవినీతి, అబద్ధాలకు ఢిల్లీ ప్రజలు గుణపాఠం నేర్పారనీ అన్నారు. కాంగ్రెస్ సమాధిపై ఢిల్లీ ప్రజలు మరో రాయిని పేర్చారని మంత్రి సత్యకుమార్ ఎద్దేవా చేశారు. బీజేపీకి పట్టం కట్టి దేశ రాజధానిని ఒక వికసిత్ ఢిల్లీగా తీర్చిదిద్దడానికి బాటలు వేసుకున్నారని సంతోషం వ్యక్తం చేశారు. ఢిల్లీ ప్రజలకు, కార్యకర్తలకు, ముఖ్యంగా ఈసారి బీజేపీని ఆదరించిన దక్షిణాది రాష్ట్రాల ప్రజలకూ ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. గెలుపొందిన వారికి హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

ఢిల్లీ ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని, విశ్వాసాన్ని ఆప్ అధినేత కేజ్రీవాల్ నిలబెట్టుకోలేదని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. సంక్షేమం, తాయిలాలతో ప్రజలను మభ్యపెట్టాలని కేజ్రీవాల్ చూశారని కేంద్రమంత్రి మండిపడ్డారు. ప్రజల్లో స్పష్టమైన మార్పు తాము ప్రచారం చేసినప్పుడే కనిపించిందని ఆయన చెప్పుకొచ్చారు. ఢిల్లీలో వెహికల్ పొల్యూషన్‌తోపాటు పొలిటికల్ పొల్యూషన్ ఉందని, బీజేపీ గెలుపుతో ఆ రెండూ పోతాయని అన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు, తాను ఢిల్లీ ఎన్నికల్లో ప్రచారం చేసిన ప్రతి చోటా బీజేపీ అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలిచారని పెమ్మసాని చెప్పుకొచ్చారు. ఆ రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకున్నారని, అందుకే డబుల్ ఇంజన్ సర్కార్‌ని గెలిపించాలని సంతోషం వ్యక్తం చేశారు. కేజ్రీవాల్ ప్రజలకు మంచి నీరు, సరైన రోడ్లు కూడా ఇవ్వలేకపోయారని మండిపడ్డారు. ఆయన మంచి చేస్తారని రెండు సార్లు గెలిపిస్తే అవినీతి ఆరోపణలు ఎదురుకొన్నారని ధ్వజమెత్తారు. నీతి నిజాయతీతో రాజకీయం చేస్తానని గెలిచిన కేజ్రీవాల్ ఆ విధంగా చేయలేకపోయారు కాబట్టే ప్రజలు అతన్ని ఓడించారని చెప్పుకొచ్చారు. ఇక, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మాటలను ప్రజలు విశ్వసించడం లేదని కేంద్ర మంత్రి పెమ్మసాని చెప్పుకొచ్చారు.

# ఢిల్లీ ఎన్నికల ఫలితాలు రేవంత్ రెడ్డికి గుణపాఠం

హైదరాబాద్, ఫిబ్రవరి 8:ఢిల్లీ ఎన్నికల ఫలితాలు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గుణపాఠమని మెదక్ ఎంపీ రఘునందన్ రావు తెలిపారు. ఏబీఎన్‌తో రఘునందన్ రావు మాట్లాడారు. మాజీ మంత్రి కేటీఆర్‌కు దమ్ము ఉంటే 76 అసెంబ్లీ 12 పార్లమెంట్‌ల పరిధిలో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎందుకు పోటీ చేయడం లేదో చెప్పాలని అన్నారు. ఢిల్లీ ఎన్నికలకు కేటీఆర్‌కు ఏం సంబంధమని ప్రశ్నించారు. కేటీఆర్‌కు కాంగ్రెస్ మీద అంత ప్రేముంటే బీఆర్ఎస్‌ను కాంగ్రెస్ పార్టీలో మెర్జ్ చేయాలని సూచించారు.

రాబోయే రోజుల్లో బీజేపీ సత్తా ఏంటో తెలుస్తోందని అన్నారు. మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో పోటీ చేసే మొహం లేని వాళ్ల మాట్లాడితే తాము స్పందించాల్సిన అవసరం లేదని అన్నారు. కేటీఆర్ గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత బెటర్ అని చెప్పారు. ఢిల్లీ ఎన్నికల్లో రాహుల్ గాంధీకి గాడిదగుడ్డు వచ్చిందని ఎద్దేవా చేశారు. లోకల్ బాడీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఢిల్లీ ఫలితాలే పునరావృతం అవుతాయని మెదక్ ఎంపీ రఘునందన్ రావు పేర్కొన్నారు.

ఢిల్లీ ఎన్నికల ఫలితాలు తెలంగాణ రాజకీయాలను ప్రభావితం చేయబోతున్నాయని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ తెలిపారు. 27 ఏళ్ల తర్వాత అవినీతి సామ్రాజ్యం హస్తినలో కూలిందని అన్నారు. మార్పు కోసమే ఢిల్లీ ప్రజలు బీజేపీని ఆదరించారని ఉద్ఘాటించారు. తాను ఢిల్లీలో పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నానని తెలిపారు. దేశ రాజధానిలో మంచినీళ్లు దొరికే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

తెలంగాణ బీజేపీ అధ్యక్ష రేసులో తాను ఉండొచ్చని.. అది హై కమండ్ నిర్ణయమని చెప్పారు. రేవంత్ రెడ్డికి లోకల్ బాడీ ఎన్నికల భయం పట్టుకుందని విమర్శించారు. అందుకే ముందు జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు తర్వాత సర్పంచ్ ఎన్నికలు అంటున్నారని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం ఎదురు అవుతోందని ఎంపీ డీకే అరుణ పేర్కొన్నారు.

# కాంగ్రెస్ ఘోర పరాజయంలో వారిద్దరి పాత్ర.. హరీష్‌రావు షాకింగ్ కామెంట్స్

హైదరాబాద్, ఫిబ్రవరి 8:ఢిల్లీ ఎన్నికల ఫలితాలపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. సామాజిక మాధ్యమం ఎక్స్‌లో స్పందించారు. ఢిల్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గాడిద గుడ్డు మిగిలిందని విమర్శించారు. మొన్న హర్యానా, నిన్న మహారాష్ట్ర, నేడు ఢిల్లీ ఘోర పరాజయంలో రాహుల్, రేవంత్ రెడ్డి పాత్ర అమోఘమని సెటైర్లు గుప్పించారు. ఇక్కడ హామీలు అమలు చేయకుండా, ఇతర రాష్ట్రాల్లో ప్రచారం చేసుకున్నంత మాత్రాన కాంగ్రెస్‌కు ఓట్లు పడతాయా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ గ్యారెంటీల నిజస్వరూపం దేశవ్యాప్తంగా బట్టబయలైందని ఆక్షేపించారు.ఢిల్లీ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ఆగమాగం చేసిన కులగణన ఆ పార్టీకి బెడిసికొట్టిందని విమర్శించారు. ఇప్పటికైనా తప్పులు ఒప్పుకొని, ప్రజలకు క్షమాపణ చెప్పి కులగణను మళ్లీ నిర్వహించాలని సూచించారు. అన్ని కులాలకు సమన్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేసిన తర్వాత అప్పుడు ఇతర రాష్ట్రాల్లో రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారం చేసుకోవాలని హితవు పలికారు. లేదంటే రేవంత్ ఎక్కడ అడుగుపెట్టినా ఇవే ఫలితాలు పునరావృతం అవుతాయని చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాల్లోనూ కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హరీష్‌రావు హెచ్చరించారు.

# కిడ్నీ వ్యాధి బాధితునికి వెస్సో ట్రస్ట్ సహాయం



హైదరాబాద్ ఫిబరవరి 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );హైదరాబాద్ నివాసి, కార్పెంటర్ ముకురోజు శ్రీహరి(29) ఇటీవల తీవ్రమైన కడుపు నొప్పితో ఆసుపత్రిలో చేరగా, వైద్యులు అతనికి కేవలం ఒక కిడ్నీ మాత్రమే ఉందని, అది కూడా 80% దెబ్బ తిన్నదని, వెంటనే కిడ్నీ మార్పిడి చేయాలని సూచించారు. అతను అవివాహితుడు మరియు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న తల్లిని చూడాల్సిన భాధ్యత అతనిపై ఉంది. జీవన్ దాన్ ద్వారా దరఖాస్తు చేసినా, కిడ్నీ లభించడానికి 2-3 సంవత్సరాలు పట్టవచ్చు అని తెలిసింది! ప్రస్తుతం అతను డయాలిసిస్ ఆధారంగా జీవిస్తున్నాడు. ఒక్కో సెషన్‌కు ?3,000/-లు ఖర్చవుతోంది. ఈ చికిత్స కిడ్నీ మార్పిడి జరిగే వరకు కొనసాగించాల్సిన అవసరం ఉందని డాక్టర్లు అన్నారు. డయాలిసిస్ కు అయ్యే ఖర్చుల నిమిత్తం ఆర్థికంగా తీవ్రంగా ఇబ్బంది పడుతున్న శ్రీహరి స్థానిక నాయకుల ద్వారా సహాయానికై వెస్సో ట్రస్ట్ ను కోరారు. హైదరాబాద్ చింతలకుంట ఆర్టీసీ కాలనీ శ్రీ వాసవి నిలయం దేవాలయ ప్రాంగణం లో జరిగిన సేవా కార్యక్రమంలో గౌరవ దాతలు కొచ్చెర్ల సూర్య భాస్కరరావు శశికళ దంపతుల చేతుల మీదుగా ?1,42,252/-ల చెక్కును వెస్సో ట్రస్ట్ శ్రీహరికిఅందజేసింది. ఈసందర్భంగా ట్రస్ట్ అధ్యక్షులు బంగారు తాతారావు మాట్లాడుతూ ఈ మొత్తంలో లక్ష రూపాయలు దంపతుల విరాళం కాగా, ?42,252/- లు గౌరవ దాతలు వెస్సో ట్రస్ట్ కు అంద చేసిన మొత్తం విరాళం అని తెలియజేశారు. ఈ సేవా కార్యక్రమంలో గౌరవ దాతలు బిల్డర్ పోలోజు రవీంద్ర చారి, చెన్నోజు సింహాద్రి చారి, చెన్నోజు యాదాచారి, స్థానిక సంఘ నాయకులు దంతోజు ప్రభాకర చారి, కాసోజు బాలీశ్వర చారి, మహిళా నేతలు, తెలంగాణ స్టేట్ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సెక్రటరీ వెదురుపర్తి శ్రీమంగేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# "డ్రగ్ వ్యాపారులను భారత్ ఉపేక్షించదు" అంటూ ఈ విజయం గురించి వివరించిన కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:ముంబయిలో అతి పెద్ద మాదకద్రవ్యాల నెట్వర్క్‌ను నిర్వీర్యం చేసి భారత్‌లోని డ్రగ్ సిండికేట్లపై నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) సాధించిన విజయాన్ని కేంద్ర హోం, సహకార మంత్రి శ్రీ అమిత్ షా సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా తెలియజేశారు. మాదకద్రవ్యాల రహిత భారత్ (నషా ముక్త్ భారత్) సాధించాలనే ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆలోచనలకు అనుగుణంగా అనుసరిస్తున్న సమగ్ర దర్యాప్తు విధానం విజయవంతం అయిందని చెప్పడానికి ఇదే నిదర్శనమని ఆయన అన్నారు.

"నిషేధిత మాదకద్రవ్యాల వ్యాపారం చేసే వారిని భారత్ ఉపేక్షించదు. ముంబయిలో హై-గ్రేడ్ కొకైన్, గంజాయి, గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకోవడంతో పాటు నలుగురిని అరెస్టు చేయడం ద్వారా పెద్ద విజయం సాధించాం. మాదకద్రవ్య రహిత భారత్‌ను నిజం చేయాలన్న ప్రధాని శ్రీ నరేంద్రమోదీ ఆలోచనలకు అనుగుణంగా అనుసరించిన సమగ్ర దర్యాప్తు విధానం విజయవంతమైందని చెప్పడానికి ఇదే నిదర్శనం. ఈ విజయం సాధించిన నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో కు శుభాకాంక్షలు" అని కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా ఎక్స్ లో అన్నారు.

ఈ ఏడాది జనవరిలో 200 గ్రాముల కొకైన్ స్వాధీనం చేసుకున్న సమయంలో లభించిన ఆధారాలతో ఎన్‌సీబీ బృందం దర్యాప్తు చేపట్టింది. ఫలితంగా భారీ స్థాయిలో మాదకద్రవ్యాలను పట్టుకున్నారు. ఈ కేసులో లభించిన ఆధారాలను, నిఘా సమాచారం, సాంకేతిక సహకారంతో విశ్లేషించిన అనంతరం ఎన్‌సీబీకి చెందిన ముంబయి జోనల్ యూనిట్ (ఎంజడ్‌యూ) మాదకద్రవ్యాల మూలాలను గుర్తించగలిగింది. మహారాష్ట్రలోని నవీ ముంబయిలో జనవరి 31, 2025న 11.540 కేజీల కొకైన్, 4.9 కేజీల హైబ్రిడ్ స్ట్రెయిన్ హైడ్రోఫోనిక్ వీడ్/గంజాయి, 200 ప్యాకెట్లు (5.5 కేజీల) గంజాయి చాక్లెట్లు, రూ. 1,60,000 నగదు స్వాధీనం చేసుకున్నారు.

ఈ కేసులో మొదట ముంబయికి చెందిన కొరియర్ ఏజెన్సీ నుంచి ఆస్ట్రేలియాకు పంపుతున్న పార్సిల్‌ను రికవరీ చేశారు. మహారాష్ట్రలోని నవీ ముంబయిలో పెద్ద మొత్తంలో దాచిపెట్టిన మాదక ద్రవ్యాలను ఎన్‌సీబీ ఎంజడ్‌యూ విజయవంతంగా స్వాధీనం చేసుకుంది.

ఇప్పటి వరకు నిర్వహించిన దర్యాప్తులో ఈ సిండికేట్‌ను విదేశాల్లో ఉంటున్న ఓ బృందం నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. అలాగే స్వాధీనం చేసుకున్న నిషేధిత మాదకద్రవ్యాలు అమెరికా నుంచి ముంబయికి తీసుకువచ్చి, ఇక్కడి నుంచి దేశవిదేశాల్లోని రిసీవర్లకు కొరియర్/కార్గో సేవల ద్వారా చేరవేస్తున్నట్లు తేలింది. ఈ కేసుతో సంబంధమున్న వ్యక్తులకు ఒకరితో ఒకరికి పరిచయం లేదు. మాదకద్రవ్యాల గురించి మాట్లాడుకోవడానికి మారుపేర్లు ఉపయోగిస్తున్నారు.

ఈ కేసులో ఇప్పటి వరకు నలుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. ఈ కేసుతో సంబంధం ఉన్నవారిని గుర్తించేందుకు దర్యాప్తు జరుగుతోంది.

# ఢిల్లీ ఎన్నికల ఫలితాల్లో అదే జరిగింది: సీఎం చంద్రబాబు..



అమరావతి, ఫిబ్రవరి 8:ఢిల్లీ ఎన్నికల్లో 27 ఏళ్ల తర్వాత బీజేపీ విజయం చరిత్రాత్మకమని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. పీపుల్స్ ఫస్ట్ అనే నినాదం అక్కడి ఎన్నికల్లో వర్కౌట్ అయ్యిందని, ఆ నినాదమే బీజేపీని గెలిపించిందని ముఖ్యమంత్రి చెప్పారు. ప్రధాని మోదీపై నమ్మకంతోనే దేశ రాజధానిలో బీజేపీ గెలిచిందని చంద్రబాబు తెలిపారు. ఢిల్లీలో వాయు కాలుష్యం పెద్ద సమస్యగా మారిందని, ఢిల్లీ నుంచి చాలామంది ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతున్నారని ముఖ్యమంత్రి చెప్పుకొచ్చారు. సంపద సృష్టిస్తేనే ఆదాయం పెరుగుతుందని, మౌలికవసతులు వస్తాయని అన్నారు. సుపరిపాలన ఇస్తే మంచి రాజకీయాలకు నాంది పలుకుతుందని చెప్పారు. 1991 తర్వాత దేశంలో ఆర్థిక సంస్కరణలు వచ్చాయని, వాటిని తెలుగుబిడ్డ మాజీ ప్రధాని పీవీ నరసింహరావు తీసుకొచ్చారని పేర్కొన్నారు. 1995-2024 మధ్య మన తలసరి ఆదాయం 9 రెట్లు పెరిగినట్లు సీఎం చంద్రబాబు వెల్లడించారు.

తెలుగు రాష్ట్రాల్లో 3 వేల డాలర్ల తలసరి ఆదాయం ఉందని, బిహార్‌లో అది ఇంకా 750 డాలర్లుగానే ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. టెక్నాలజీ సాయంతో మనం ముందుకెళ్లామని, మనకు ఐటీ, మౌలిక వసతులు గేమ్‌ఛేంజర్‌గా మారాయని సీఎం చెప్పుకొచ్చారు. సరైన సమయంలో సరైన నాయకత్వం చాలా కీలకమైన విషయమని, భారత్‌కు సరైన సమయంలో వచ్చిన సరైన నాయకుడు మోదీ అని చంద్రబాబు కొనియాడారు.

స్థిరమైన పాలన, పాలసీలు, గ్రోత్.. గుజరాత్ అభివృద్ధికి కారణం అయ్యాయని, కొందరు నేతలు సంక్షేమం పేరుతో అవినీతికి పాల్పడుతున్నారని ఆయన మండిపడ్డారు.అలాంటి నేతల కారణంగా రాజకీయాల్లో కాలుష్యం పెరుగుతోందని చంద్రబాబు మండిపడ్డారు. ఆప్ పాలనలో ఢిల్లీలో ఎక్కడ చూసినా చెత్త పేరుకుపోయిందని, కొన్ని విధానాలతో అత్యంత కాలుష్య నగరంగా ఢిల్లీ మారిందని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీ పరిశుభ్రతను ఆప్ ప్రభుత్వం పట్టించుకోలేదని, లిక్కర్ స్కామ్‌లో చిక్కుకున్న ఎవ్వరూ బాగుపడలేదని అన్నారు. ఏపీ, ఢిల్లీలో ప్రజల ఆకాంక్షలను గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని, ఓటేసిన పాపానికి ప్రజల భవిష్యత్‌ను కాటేశారని ముఖ్యమంత్రి ధ్వజమెత్తారు. సంపద సృష్టించలేని, ప్రభుత్వానికి ఆదాయం పెంచలేని నేతలు ఎందుకంటూ చంద్రబాబు ప్రశ్నించారు.

# క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట.. ఎమ్మెల్యే మేఘారెడ్డి



మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 8: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా క్రీడల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని, యువత ఉన్నత చదువులతో పాటు క్రీడలపై కూడా దృష్టి సారించాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. వనపర్తి పట్టణంలోని 22వ వార్డు బాలాజీ నగర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన బాక్స్ క్రికెట్ క్రీడా ప్రాంగణాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. జిల్లా కేంద్రంలో ఇంత పెద్ద బాక్స్ క్రికెట్ ప్రాంగణాన్ని ఏర్పాటు చేసి క్రీడా శిక్షణను ఇస్తున్న యువకులు చంద్రకాంత్, సాయికాంత్ భాను ప్రకాష్, గిరీష్ లను ఎమ్మెల్యే అభినందించారు.

ఆసక్తిగల క్రికెట్ క్రీడాకారులు ఈ క్రీడా ప్రాంగణాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. క్రీడల వలన జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోనూ గుర్తింపు పొందవచ్చునని, దాంతో జన్మనిచ్చిన తల్లిదండ్రులకు, సొంత గ్రామానికి పేరు ప్రఖ్యాతలు చేకూరుతాయని ఎమ్మెల్యే అన్నారు. యువకులు ఉన్నత ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తూనే, ఇలాంటి స్వయం ఉపాధి కేంద్రాలను ఏర్పాటు చేసుకోవడం వల్ల భవిష్యత్తు బాగుంటుందన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయాల చైర్మన్ గోవర్ధన్ సాగర్, జిల్లాయూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చీర్ల చందర్, వనపర్తి పట్టణ మాజీ మున్సిపల్ చైర్మన్ పుట్టపాకుల మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణయ్య, వనపర్తి మండల మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, మాజీ జెడ్పీటిసి గొల్ల వెంకటయ్య, మాజీ కౌన్సిలర్లు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వానము
GVR CULTURAL FOUNDATION
జివిఆర్ కల్చరల్ ఫౌండేషన్
డా॥ కె.వి. రమణ, ఐ.ఎ.ఎస్. (రి) గారి
74వ జన్మదినోత్సవ వేడుకలు
డా॥ కె.వి. రమణ, ఐ.ఎ.ఎస్ (రి) గారి ఆశీస్సులతో...
శ్రీ గుదిబండి వెంకటరెడ్డి, శ్రీ వి.వి. రాఘవరెడ్డి
హాస్యానందం సౌజన్యంతో నిర్వహించిన కార్టూన్ పోటీలలో బహుమతి పొందిన కార్టూన్ విజేతలు 10 మందికి ఒకొక్కరికి 3,000/- రూపాయల నగదు బహూకరణ
ముఖ్య అతిథులు :
శ్రీ సి. రామకృష్ణ, పూర్వ జనరల్ మేనేజర్, దక్షిణమధ్య రైల్వే
డా॥ కె.వి. రమణ, ఐ.ఎ.ఎస్. (రి)
సభాధ్యక్షులు : లయన్ డా॥ చిల్లా రాజశేఖర్‌రెడ్డి, పారిశ్రామికవేత్త
సభాప్రారంభం : శ్రీ లంక లక్ష్మీనారాయణ, అధ్యక్షులు, యువకళావాహిని
నూతన వస్త్రాలు మరియు ప్రత్యేక జ్ఞాపిక బహూకరణ : డా॥ రామరాజు శ్రీనివాసరావు, ఛైర్మన్, రామరాజు ఫౌండేషన్, గుంటూరు.
జ్యోతి ప్రకాశనం : శ్రీమతి నిర్మలా ప్రభాకర్, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం, పాలకమండలి సభ్యురాలు
విజేతల స్వాగత సత్కారం : శ్రీ పి. రాము, సంపాదకులు, హాస్యానందం
అతిథి సత్కారం : శ్రీ బొప్పన నరసింహారావు, అధ్యక్షులు, కళావిపంచి
12-02-2025, బుధవారం, సా॥ 6.00 గం॥లకు
శ్రీ త్యాగరాయ గానసభ, (ప్రధాన మందిరం) చిక్కడపల్లి, హైదరాబాద్.
శ్రీ గుదిబండి వెంకటరెడ్డి, ఛైర్మన్ ఫోన్ : 9849882783
శ్రీ వి.వి. రాఘవరెడ్డి, ప్రధానకార్యదర్శి ఫోన్ : 9866332738

# నమ్మకానికి,నాణ్యతకు చిరునామా లలితా జువెల్లరీ...

**– ఖమ్మం లలితా వారి ప్రతిష్టాత్మకమైన 60వ బ్రాంచ్ షోరూంను ప్రారంభించిన మంత్రులు తుమ్మల, పొంగులేటి**

**– డబ్బులు ఎవరికి ఊరికే రావు,అన్ని నగల షోరూమ్ లలో చూశాకే మాలలితా జ్యూవెలరీకి రండి..లలితా జ్యూవెలరీ షోరూమ్స్ అధినేత ఏం.కిరణ్ కుమార్..**



ఖమ్మం, ఫిబ్రవరి 8 (నేటినిజం ప్రతినిధి) :నమ్మకానికి,నాణ్యతకు చిరునామా లలితా జువెల్లరీ షోరూమ్ అని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు అన్నారు. శనివారం ఖమ్మంలోని లలితా జువెల్లెరి 60వ బ్రాంచ్ ప్రారంభోత్సవం ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలకు శుభసూచికమని, లలితా జ్యువెల్లరీ అధినేత కిరణ్ కుమార్ సేవలు ప్రశంసనీయమైన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. 41 సంవత్సరాలకు పైగా సేవలందిస్తూ దక్షిణ భారతదేశంలో అగ్రగామిగా గుర్తింపు తెచ్చుకున్న లలితా జ్యువెల్లరి అని వారన్నారు. తయారీ ధరకే బంగారం, వజ్రాభరణాలను అందించేందుకు సిద్ధంగా ఉందని, తద్వార ప్రజలు పెద్దమొత్తంలో తమ కష్టార్జితాన్ని ఆదా చేయొచ్చు! అంతేకాదనీ, ప్రారంభోత్సవం సందర్భంగా మార్కెట్లోనే ఇతర షోరూంలలో లభించని సరికొత్త ‘బంగారు నగల కొనుగోలు పథకం’ను కూడా అందిస్తోందని వారన్నారు. ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో పలు ప్రాంతాల్లో విశేష ఆధరణను పొందిన లలితా జ్యువెల్లరి అని వారన్నారు. అన్ని ప్రాంతాల వారికి తక్కువ తరుగు, తక్కువ ధరలో నగలు ఇవ్వాలనే ఉద్దేశంతో, వినియోగదారుల ఆశీస్సులతో ఈ షోరూంలను ఆరంభిస్తుండటం మరింత విశేషం అని అన్నారు.

అనంతరం లలితా జ్యూవెలరీ షోరూమ్ అధినేత కిరణ్ కుమార్ మాట్లాడుతూ...తమ బ్రాంచులు”వైజాగ్, విజయవాడ, తిరుపతి, రాజ మహేంద్ర వరం, భీమవరం, కాకినాడ, చిత్తూరు, నెల్లూరు, గూడూరు, సూళ్లూరుపేట, గుంటూరు, శ్రీకాకుళం, గోపాలపట్నం, అనకాపల్లి, గాజువాక, విజయనగరం, తుని, అనంతపురం, కడవ, ఒంగోలు, కర్నూలు, నరసారావుపేట, అమలాపురం, నిజామా బాద్, వరంగల్, మిర్యాలగూడ, హైదరాబాద్లోని కూకట్పల్లి, సోమాజిగూడ, దిల్షుఖ్నగర్, చందానగర్, సుచిత్రాసర్కిల్ షోరూంలకు ప్రజల నుంచి దక్కిన విశేష ఆధరణను చూసి దక్షిణ భారతదేశం వ్యాప్తంగా మా సేవలు విస్తృతం చేయాలనుకుంటు న్నామని అన్నారు. ఖమ్మం, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ఎక్కువ స్థాయిలో ప్రజలు మా ఇతర షోరూంలకు వచ్చి నగలు కొనుగోలు చేస్తున్నారని అన్నారు. తొలుత షోరూమ్ ని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి లు ప్రారంభించిన అనంతరం జ్యోతి ప్రజ్వలన గావినీచారు. అనంతరం షోరూమ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ కార్పోరేషన్ చైర్మెన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం నగర మేయర్, డిప్యూటి మేయర్, కార్పొరేటర్లు, నాయకులు తదితరులు ప్రసనీగించారు.

# ఫిబ్రవరి 22 నుండి కొత్త ఫార్మాట్‌లో జరిగే గార్డ్ వేడుకల మార్పు

ఫిబ్రవరి 22, 2025 నుండి పెరిగిన సీటింగ్ సామర్థ్యంతో గార్డు మార్పు వేడుక కొత్త ఫార్మాట్‌లో జరుగుతుంది.

భారత రాష్ట్రపతి, శ్రీమతి ద్రౌపది ముర్ము ఫిబ్రవరి 16, 2025న ప్రారంభ ప్రదర్శనను చూస్తారు.

గార్డు మార్పు వేడుక యొక్క కొత్త ఆకృతిలో, ప్రజలు రాష్ట్రపతి భవన్ నేపథ్యంతో డైనమిక్ దృశ్య మరియు సంగీత ప్రదర్శనను చూడవచ్చు. వేడుకలో ప్రెసిడెంట్ అంగరక్షకుల దళాలు మరియు గుర్రాలు మరియు సెరిమోనియల్ గార్డ్ బెటాలియన్ యొక్క దళాలు, సెరిమోనియల్ మిలిటరీ బ్రాస్ బ్యాండ్‌తో పాటు అధికారిక సైనిక కసరత్తులు ఉంటాయి.

# ద్వైవార్షిక ఏరో-ఇండియా అంతర్జాతీయ సెమినార్ 15వ ఎడిషన్ బెంగళూరులో ప్రారంభం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:ద్వైవార్షిక ఏరో-ఇండియా ఇంటర్నేషనల్ సెమినార్ యొక్క 15వ ఎడిషన్ ఫిబ్రవరి 08, 2025న కర్నాటక లోని బెంగళూరులో ప్రారంభమైంది. ఈ రెండు రోజుల సెమినార్‌ను సెంటర్ ఫర్ మిలిటరీ ఎయిర్‌వర్తినెస్ ఉ సర్టిఫికేషన్ ఆఫ్ డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ నుండి ంవతీనీటవమాఎ ఆఫ్ ఇండియా తో కలిసి ంవతీనీటవమాఎ 2025, ఇది ఫిబ్రవరి 10 నుండి 14, 2025 వరకు బెంగళూరులో జరుగుతుంది.

సెమినార్ గ్లోబల్ ఏరోస్పేస్ రంగంలో ఒక ప్రధాన కార్యక్రమం. ఈ సంవత్సరం థీమ్ ‘ఫ్యూచరిస్టిక్ ఏరోస్పేస్ టెక్నాలజీస్: డిజైన్ వాలిడేషన్‌లో సవాళ్లు’, ఫ్యూచరిస్టిక్ ఏరోస్పేస్ టెక్నాలజీస్ మరియు మిలిటరీ ఎయిర్‌వర్థినెస్ ఉ సర్టిఫికేషన్‌లో ఎమర్జింగ్ ట్రెండ్‌లపై చర్చలు మరియు చర్చలను హైలైట్ చేస్తుంది: డిజైన్ మరియు టెస్టింగ్‌లో సవాలు. ఈవెంట్‌కు హాజరయ్యే అంతర్జాతీయ ప్రతినిధులు ఎయిర్‌బస్ డిఫెన్స్ మరియు స్పెయిన్ నుండి స్పేస్ వంటి ప్రముఖ విదేశీ కంపెనీలకు చెందినవారు; కాలిన్స్ ఏరోస్పేస్, ఏరోస్పేస్, మార్టిన్-బేకర్, మరియు రోల్స్ రాయిస్, ఇజ్రాయెల్ నుండి రాఫెల్ అడ్వాన్స్‌డ్ డిఫెన్స్ సిస్టమ్స్ మరియు ంాంఈఖీంఔ ఫ్రాన్స్. సెమినార్‌లో పాల్గొనే భారతీయ పరిశ్రమలో అబేయాంట్రిక్స్ సొల్యూషన్స్, అన్సిస్ ఇంక్., గ్లోబల్స్ ఇంక్., జెఎస్ఆర్ డైనమిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఉన్నాయి

సెమినార్ సహకార పరిశోధన అవకాశాలను అన్వేషించడానికి మరియు ఏరోస్పేస్ మరియు డిఫెన్స్ టెక్నాలజీల భవిష్యత్తును అభివృద్ధి చేయడానికి వ్యూహాత్మక బ.ా గ్ సా్వవ వ్యాలనం రూపొందించడానికి ఒక వేదికను అందిస్తుంది.

ఫ్యూచరిస్టిక్ ఏరోస్పేస్ టెక్నాలజీస్‌పై డిజైన్ వాలిడేషన్‌లో సవాళ్లపై వివిధ అంశాలను కవర్ చేసే మొత్తం 12 సాంకేతిక సెషన్‌లు షెడ్యూల్ చేయబడ్డాయి. ‘ఫ్యూచరిస్టిక్ ఏరోస్పేస్ టెక్నాలజీస్: డిజైన్ వాలిడేషన్‌లో సవాళ్లు’ అనే అంశంపై జరిగిన సెమినార్‌లో సిస్టమ్ డిజైన్ మరియు ధ్రువీకరణ కోసం కట్టింగ్-ఎడ్జ్ టెక్నాలజీస్, ఎయిర్‌వర్తినెస్ ఉ సర్టిఫికేషన్ కోసం ఇన్నోవేటివ్ అప్రోచ్‌లు, లెవరేజింగ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఫ్యూచర్ ఆఫ్ ఏవియేషన్ మరియు పయోనీస్ అడ్వాన్స్‌మెంట్స్‌లో ఫ్యూచర్‌ను మెరుగుపరచడం వంటి వివిధ అంశాలపై దృష్టి సారిస్తుంది. టెక్నాలజీ, నెక్స్ట్-జెన్ ప్రొపల్షన్ సిస్టమ్స్‌లో గ్లోబల్ ఇన్‌సైట్‌లు, మిలిటరీ ఏవియేషన్‌లో ఎమర్జింగ్ ట్రెండ్‌లు, భూమిని దాటి మానవ మిషన్‌లను నడిపించే ఆవిష్కరణలు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అంతరిక్ష శాఖ కార్యదర్శి, ఇస్రో చైర్మన్ డాక్టర్ వి నారాయణన్, గౌరవ అతిథిగా డిపార్ట్‌మెంట్ ఆర్ అండ్ డి సెక్రటరీ, డిఆర్‌డిఓ చైర్మన్ డాక్టర్ సమీర్ వి కామత్ పాల్గొన్నారు.

కార్యక్రమంలో ఏఈఎస్ఐ డాక్టర్ జి సతీష్‌రెడ్డి పాల్గొన్నారు. ఓఈఇలతో సహా ఆఫీఆ, డిఫెన్స్ ఖూజలు, సాయుధ దళాలు మరియు ప్రైవేట్ పరిశ్రమల నుండి దాదాపు 1,100 మంది ప్రతినిధులు పాల్గొంటున్నారు.

ఇంకా, భారతదేశం మరియు విదేశాల నుండి 33 మంది వక్తలు డొమైన్‌లోని అనేక అంశాలపై సాంకేతిక చర్చలను అందిస్తారు.

# అధికారం ఇస్తే గాడిద గుడ్డు ఇచ్చారు : బండి సంజయ్

**-కుల గణన బోగస్**

**-కాంగ్రెస్, బిఆర్ఎస్ ఒకటే**

**-ప్రశ్నించే గొంతులకు ఓటెయ్యండి**

**-ఢిల్లీ ప్రజలు కాంగ్రెస్ ను ఛీ కొట్టారు**

కరీంనగర్, ఫిబ్రవరి 8: మోసపూరిత హామీలను నమ్మి కాంగ్రెస్కు ఓటేస్తే తెలంగాణ ప్రజలకు గాడిద గుడ్డు చేతిలో పెట్టారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఏద్దేవా చేశారు. శనివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన పట్టభద్రుల సంకల్ప యాత్రలో మాట్లాడుతూ 14 నెలల క్రితం ఆచరణకు సాధ్యం కానీ హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్ ప్రభుత్వం ప్రజలను నట్టేట ముంచిందన్నారు.

ఆడపిల్లలకు స్కూటీలు ఇస్తామని, మహిళలందరికీ 25 వందల రూపాయలు ఇస్తామని, రైతు భరోసా 15000 ఇస్తామని, పింఛన్లు నాలుగు వేలకు పెంచుతామని, కల్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచిన హామీలు అమలు చేయడం లేదన్నారు.

ఏ హామీ అమలు చేయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లి కాంగ్రెస్ తరపున ప్రచారం చేస్తే ప్రజలు తెలంగాణలో చేస్తున్న మోసాన్ని గమనించి ఫలితాల్లో గుండు సున్న ఇచ్చారన్నారు. ఢిల్లీ ప్రజలు కాషాయానికి జై కొట్టారని మోడీ నామస్మరణ చేశారన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిరుద్యోగుల కోసం ఉపాధ్యాయుల కోసం భారతీయ జనతా పార్టీ అనేక ఆందోళన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు లాఠీ దెబ్బలు తిని జైలుకు వెళ్లామన్నారు.

ఆ సమయంలో ఇప్పటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కానీ ఆ పార్టీ మంత్రులు కానీ ఒక్కరు కూడా నిరుద్యోగుల పక్షాన పోరాడా లేదన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని రేవంత్ ప్రభుత్వం మాట తప్పిందని, మోడీ సర్కారు మాత్రం ఏడాది కాలంలో 9 లక్షల 25 వేల ఉద్యోగాలు ఇచ్చారన్నారు. తెలంగాణ ప్రజలను మోసగించిన కాంగ్రెస్ పార్టీకి ఎమ్మెల్సీ ఎన్నికల్లో మేధావి వర్గం తగిన గుణపాఠం చెప్పాలన్నారు.

ఢిల్లీ ఫలితాలను స్ఫూర్తిగా తీసుకొని ఫిబ్రవరి 27 తేదీన జరిగే మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో ప్రశ్నించే గొంతుకలైన బిజెపి అభ్యర్థులను గెలిపించాలన్నారు. కాంగ్రెస్కు ఓటేస్తే డీఏ కోసం ప్రశ్నించేవారు ఉండరని పిఆర్సి కోసం డిమాండ్ చేసేవారు ఉండరన్నారు.

బిజెపి అభ్యర్థులైన అంజిరెడ్డి, కొమురయ్య, సరోత్తమ్ రెడ్డిలను గెలిపిస్తే ప్రభుత్వం మెడలు వంచి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. బిఆర్ఎస్ కాంగ్రెస్ ఒకటేనని అందుకే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా పోటీలో ఉండడం లేదన్నారు.

కాళేశ్వరం కేసు, ఫామ్ హౌస్ కేసు, డ్రగ్స్ కేసు, కార్ రేసుల్లో నిందితులను అరెస్టు చేసుకోవాలని హైకోర్టు, సుప్రీంకోర్టు తెలియజేసినా ఇప్పటివరకు అరెస్టు చేయకపోవడం వెనుక ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి దూరం ఉంటామని ఒప్పందం



కుదుర్చుకోవడమే అన్నారు. రెండు పార్టీల మధ్య ఒప్పందం మేరకే పోటీకి దూరంగా ఉన్నారని, అందువల్లే కేసీఆర్ కుటుంబం జైలుకు వెళ్లడం లేదన్నారు.

బీసీ కుల గణన మొత్తం బోగస్ అని, ఎన్నికల కమిషన్ లెక్కల ప్రకారం రాష్ట్రంలో మూడు కోట్ల 30 లక్షల ఓటర్లు ఉన్నారన్నారు. తాజాగా ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో రాష్ట్ర జనాభా మూడు కోట్ల 70 లక్షలు అని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్ర జనాభా నాలుగు కోట్ల 30 లక్షలకు పైగా ఉందన్నారు.

60 లక్షల మందిని సర్వేలో చూపెట్టకపోవడం వెనక ముస్లింలను బీసీలుగా చేర్చే కుట్ర దాగి ఉందన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ముస్లింలను బీసీలుగా గుర్తించొద్దని డిమాండ్ చేశారు. బీసీలకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్ పార్టీని రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బొంద పెట్టాలని, అప్పుడే రేవంత్ సర్కార్ కు బుద్ధి వస్తుందన్నారు.

# కారు, లారీ ఢీ.. వెలుగులోకి అక్రమ బియ్యం సరఫరా



ఆదిలాబాద్, ఫిబ్రవరి 8: బియ్యం లోడ్ తో వెళ్తున్న లారీ భైంసా పట్టణంలోని శివాజీ చౌరస్తాలో ఓ కారును ఢీకొట్టి పోలీసులకు పట్టుబడింది. బియ్యం లోడ్ తో భైంసా మీదుగా వెళ్తున్న లారీ పట్టణ కేంద్రంలోని శివాజీ చౌక్ లో యూటర్న్ తీసుకుంటున్న ఓ కారుని యాక్సిడెంట్ చేయగా.. కారు డ్రైవర్ కు నుదుటిపై గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు గాయాలపాలైన కారు డ్రైవర్ ను ఆస్పత్రికి తరలించారు. పోలీసులు లారీని పట్టుకొని సీజ్ చేయగా, లారీలో ఉన్న లోడ్ ను పరిశీలించగా పీడీఎస్ బియ్యంగా గుర్తించారు. వెంటనే సంబంధిత డీటీ, సివిల్ సప్లై అధికారులకు సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి జిల్లా సివిల్ సప్లై అధికారి కిరణ్ కుమార్ చేరుకొని పట్టుపడ్డ బియ్యాన్ని పరిశీలించారు. దాదాపు 30టన్నుల పైనే పీడీఎస్? బియ్యం ఉన్నట్లు గుర్తించారు. బియ్యం ఎక్కడి నుండి ఎక్కడికి వెళ్తున్నాయన్న విషయాలు పూర్తి దర్యాప్తులో తేలుతుందని ఏఎస్పీ అవినాష్ కుమార్ పేర్కొన్నారు.

# ఐక్య ఉద్యమాలతోనే ఇండ్ల స్థలాలు సాధ్యం

**-దశలవారి ఉద్యమాలకు జర్నలిస్టులు సిద్ధంకావాలి**

**-జర్నలిస్టు హౌసింగ్ సొసైటీఅధ్యక్షులు కనకం సైదులు**

**-యుద్ధభేరి మోగించిన ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు**




ఖమ్మం, ఫిబ్రవరి 8 (నేటినిజం ప్రతినిధి) :మూడు దశాబ్దాల జర్నలిస్టుల సొంతింటి కల సహకారం చేసుకునేందుకు జర్నలిస్టులు ఐక్యతతో ఉద్యమాలకు సిద్ధం కావాలని ఖమ్మం స్తంభాద్రి జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు కనకం సైదులు పిలుపునిచ్చారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు అధ్యక్షతన శనివారం జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సాధనకోసం జరిగిన యుద్ధభేరి సన్నహాక సమావేశంలో సొసైటీ అధ్యక్షులు కనకం సైదులు పాల్గొని ప్రసంగించారు. అనేక ఏండ్లుగా జర్నలిస్టులు ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్నారని కానీ జరుగుతున్న పరిణామాలు తీవ్ర ఆందోళన కలిగించటం బాధాకరమని అన్నారు. ఇప్పటికే అనేకమార్లు మంత్రులను, అధికారులను సంప్రదించామని కానీ అనుకున్న లక్ష్యం ఇంకా నెరవేరలేకపోవడం బాధను కలిగిస్తుందన్నారు. మూడు ప్రధాన జర్నలిస్ట్ యూనియన్లు అయిన ఐజేయు,టీజేఎఫ్,ఫెడరేషన్ తో పాటు హౌసింగ్ సొసైటీ కృషితో అధికారుల ఆమోదంతో ఏ అడ్డంకి లేకుండా ఇండ్ల స్థలాలు వచ్చాయనుకున్న సందర్భంలో కుంటి సాకులతో అడ్డు పడడం తీవ్ర నిరాశలకు లోనయ్యామని అన్నారు. మూడు ప్రధాన యూనియన్లు, హౌసింగ్ సొసైటీ తో పాటు ప్రెస్ క్లబ్ కమిటీతో కలిసి ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు ప్రెస్ క్లబ్ వేదికగా యుద్ధభేరి మోగించారు. ఈ కార్యక్రమంలో ఐజేయు ఉపాధ్యక్షు లు మోహినుద్దీన్, టీజేఎఫ్ నగర ఉపాధ్యక్షులు అమరవరపు కోటేశ్వరరావు, పసుపులేటి సత్య నారాయణ, హెచ్ఎంటీవీ గణేష్, సీనియర్ సబ్ ఎడిటర్ అచ్చిరెడ్డి, ప్రెస్ క్లబ్ కోశాధికారు లు నామా పురుషోత్తం, బిక్కి గోపి, ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కొరకొప్పుల రాంబాబు, జర్నలిస్ట్ నాయకులు టీఎస్ చక్రవర్తి, ఎస్.కె జానీపాషా, మేడి రమేష్, బండికుమార్, గోవింద్, సంతోష్, పాశం వెంకటేశ్వర్లు, పానకాలరావు, అంతోటి శ్రీనివాస్, ఖాసిం, ప్రభాకర్ రెడ్డి, మందుల వెంకటేశ్వర్లు, వేల్పుల నాగేశ్వరరావు, నరేష్, ఇసంపల్లి వెంకటేశ్వర్లు, అప్పారావు, వెంకట్ రెడ్డి, బాబు, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, బిక్షం, మహేష్ తదితరులు పాల్గొన్నారు.




# కొత్త రేషన్ కార్డులకు ఈసీ బ్రేక్ !

హైదరాబాద్, ఫిబ్రవరి 8:తెలంగాణలో కొత్త రేషన్ కార్డుల దరఖాస్తు ప్రక్రియకు ఎన్నికల సంఘం బ్రేక్ వేసింది. రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఈసీ ఈ నిర్ణయం తీసుకుంది. కాగా, రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిన్న ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే.

# భారతదేశం యొక్క ప్రతి మూలలో భారతీయ భాషలలో పుస్తకాలు ఒక జాతీయ మిషన్ - శ్రీ ధర్మేంద్ర ప్రధాన్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:కేంద్ర విద్యాశాఖ మంత్రి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ ఈరోజు న్యూ ఢిల్లీ వరల్డ్ బుక్ ఫెయిర్ 2025లో పిఎం యువ 2.0 పథకం కింద 41 కొత్త పుస్తకాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి త్రిపుర గవర్నర్ శ్రీ ఇంద్రసేనారెడ్డి నల్లు గౌరవ అతిథిగా హాజరయ్యారు.

సభను ఉద్దేశించి ప్రసంగిస్తూ, పుస్తకాలను ఆవిష్కరించిన 41 మంది యువ రచయితలను శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ అభినందించారు. వారి సామర్థ్యాలపై విశ్వాసాన్ని వ్యక్తం చేస్తూ, వారి రచనలు మరియు సృజనాత్మకత సాహిత్య భూభాగాన్ని సుసంపన్నం చేస్తాయని మరియు మేధో సంభాషణకు కొత్త దిశను అందిస్తాయన్నారు.

జాతీయ ఉద్యమంగా రూపాంతరం చెందడాన్ని ఎత్తిచూపుతూ ప్రధానమంత్రి యువ పథకాన్ని రూపొందించినందుకు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీకి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. వర్ధమాన రచయితలకు మార్గదర్శకత్వం మరియు పోషణ, భారతీయ సంస్కృతి, వారసత్వం, చరిత్ర, భాషలు మరియు సాహిత్యం యొక్క గర్వించదగిన రాయబారులను పెంపొందించడం మరియు స్వాతంత్ర్య పోరాటంలో పాడని వీరుల కథలను వెలుగులోకి తీసుకురావడంపై అతను దాని గణనీయమైన ప్రభావాన్ని నొక్కి చెప్పాడు.

దేశవ్యాప్తంగా భారతీయ భాషల్లో పుస్తకాలను ప్రచారం చేయడం జాతీయ లక్ష్యం అని శ్రీ ప్రధాన్ నొక్కి చెప్పారు. పిఎం యువ వంటి కార్యక్రమాలు ఈ దిశలో సంచలనాత్మక చర్యలుగా ఆయన అభివర్ణించారు. ఈ ఏడాది బడ్జెట్‌లో ఇటీవల ప్రకటించిన ‘భారతీయ భాషా పుస్తక్ పథకం’ ఈ జాతీయ ప్రయత్నానికి ఊపునిస్తుందని ఆయన నొక్కి చెప్పారు.



భారతీయ భాషలలో పుస్తకాలు మరియు సాహిత్యాన్ని అందుబాటులోకి తీసుకురావడంలో నేషనల్ బుక్ ట్రస్ట్ యొక్క కీలక పాత్రను గుర్తిస్తూ, భారతదేశం యొక్క గొప్ప సాహిత్య వారసత్వం మరియు భాషా సంప్రదాయాలను ప్రపంచ ప్రేక్షకులకు తీసుకెళ్లడానికి సాంకేతికతను స్వీకరించాలని మరియు దేశీయ మరియు అంతర్జాతీయ ప్రచురణకర్తలతో సహకరించాలని ఆయన సంస్థను కోరారు.

మంత్రి ఎగ్జిబిషన్ హాల్స్‌ను కూడా సందర్శించారు మరియు ప్రపంచంలోనే అతిపెద్ద పుస్తక ప్రదర్శనలలో ఒకటైన ఎన్‌బిటిని అభినందించారు. సాహిత్యం, భాషలు, జ్ఞానం, వ్యక్తులు మరియు సంస్కృతుల “జ్ఞాన్-కుంభ్” అని పిలుస్తూ, అతను ఈ జాతరను పాఠకుల స్వర్గంగా అభివర్ణించాడు-కొత్త పుస్తకాలను కనుగొనడానికి, సాహిత్యంలో మునిగిపోవడానికి, రచయితలను కలవడానికి మరియు తోటి పుస్తక ప్రేమికులతో కనెక్ట్ అవ్వడానికి ఇది ఒక ఆదర్శ వేదిక. అదనంగా, శ్రీ ప్రధాన్ ది సాగా ఆఫ్ కుడోపాలి: ది అన్‌సంగ్ స్టోరీ ఆఫ్ 1857 యొక్క హిందీ వెర్షన్‌ను విడుదల చేశారు. ఈ పుస్తకం త్వరలో 12 భారతీయ మరియు రెండు విదేశీ భాషల్లో అందుబాటులోకి వస్తుందని, ఇది విస్తృత స్థాయికి మరియు లోతైన ప్రభావాన్ని నిర్ధారిస్తుంది. అతను 14వ శతాబ్దపు గణిత శాస్త్రజ్ఞుడు మరియు ఖగోళ శాస్త్రవేత్త శ్రీ మాధవ రచనలకు మలయాళ అనువాదం సంగమ మాధవంటే రాండు కృతికల్‌ని కూడా విడుదల చేశాడు.

# సోమవారం కలెక్టరేట్లో నిర్వహించే.ప్రజావాణి దరఖాస్తులు హెల్ప్ డెస్క్ ద్వారా స్వీకరణ

మెదక్, ఫిబ్రవరి 8:(నేటినిజం ప్రతినిధి):ఎమ్మెల్సీ ఎన్నికల విధులు కేటాయించిన వివిధ శాఖల అధికారులు అందుబాటులో ఉండరు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్. 10-02-2025 సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు హెల్ప్ డెస్క్ ద్వారా మాత్రమే దరఖాస్తులు సమర్పించాలని, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ విజ్ఞప్తి చేశారు . ప్రజావాణి కార్యక్రమం పై కలెక్టర్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలసందర్భంగా సంబంధిత శాఖల అధికారులు విధుల్లో నిమగ్నమై ఉన్నందున. అధికారులు ప్రజావాణికి అందుబాటులో ఉండరని తెలిపారు ప్రజలందరూ 10.02.2025 సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ లో ప్రజావాణి దరఖాస్తులు అందజేయాలని కలెక్టర్ తెలిపారు. ఇట్టి విషయాన్ని ప్రజలందరూ గమనించి సహకరించాలన్నారు

